UESI
ANDHRA PRADESH

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.4

February 2024

Knowing
REGCON
2024
Growing
Serving

ఎరగడం...
ఎదగడం...
సేవించడం...

ఫిలిప్పీ 3:10,11



# మన తరానికి సేవ చేద్దాం

"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్పకార్యములు చేసెదరు". దానియేలు 11:32

మన దేశ ప్రజలు ఎన్నో సమస్యలతో సతమత మవుతున్నారు. కులం, మతమౌఢ్యం, కరప్షన్, పేదరికం, తీవ్రవాదంలాంటి సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీటికి యువ్వనస్థులు, కళాశాల విద్యార్థులు ఎక్కువగా బలైపోతున్నారు. అనేక నిర్జీవ సంస్థలు విద్యార్థులను చేరదీసి వారి కార్యకలాపాల్లో ఉపయోగించి వారి జీవితాలు పాడు చేస్తున్నాయి. నేటి విద్యార్థులు భవిష్యత్ సమాజంలో అతి ప్రాముఖ్యమైన వారు, ప్రభావం చేసేవారు, కీలక బాధ్యతలు వహించేవారు. వీరిని క్రైస్తవ సంఘాలు, సంస్థలు నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. దర్శనం లేని చోట ప్రజలు కట్టులేక తిరుగుతారు. దేవునికి వందనాలు. దేవుడు మనకు ఈ విద్యార్థుల పరిచర్యను గూర్చిన దర్శనాన్ని ఇచ్చాడు. ఈ సహవాసంలో ఉన్న గ్రాడ్యుయేట్స్, స్టాఫ్, విద్యార్థులు దేవుడిచ్చిన గొప్ప దర్శనంతో విద్యార్థుల మధ్య పని చేయాల్సి ఉంది.

అపొస్తలుడైన పౌలు - నేను దేవుడిచ్చిన దర్శనానికి అవిధేయుడను కాను అన్నాడు. దర్శనం ద్వారా ప్రభువును నమ్ముకొని ఆయన సేవ కొరకైన పిలుపును గ్రహించి, నాణ్యమైన గొప్ప సేవ చేశాడు. అయన రాసిన ఉత్తరాలు క్రైస్తవ సంఘాలకి మార్గదర్శకాలుగా ఉన్నాయి. ఫిలిప్పీయులకు రాసిన పత్రిక 3:10,11 ఆధారంగా 'తెలుసుకోవాలి, ఎదగాలి, సేవ చేయాలి' అనే అంశం ఆధారంగా దేవుడు రెగ్‌కాన్‌కు థీమ్‌ను ఇచ్చాడు.

**తెలుసుకోవాలి:** గొప్ప అనుభవజ్ఞుడైన పౌలు ఫిలిప్పీయులకు ఉత్తరం రాస్తూ నేను క్రీస్తును, ఆయన పునరుత్థాన బలాన్ని, ఆయన శ్రమలలో పాలివాడవ్వడం గూర్చి ఇంకనూ ఎరగాలని ఆశ పడుతున్నానని చెప్పాడు. ఆయనను ఎరగడానికి (అనుభవజ్ఞానము) అడ్డువచ్చే దేనినైనా పౌలు పెంటతో సమానంగా ఎంచుకొన్నాడు. ఆత్మీయంగా మనకు కూడా ఇలాంటి అశ ఉండాలి. ఒక విశ్వాసి బలంగా జీవించడానికి ఎదగడానికి ఫలభరితమైన సేవ చేయడానికి గొప్ప రహస్యమిదే.

ఆయనను ఎరగడం ఎలా? ఆయనతో సన్నిహిత సహవాసం కలిగి ఉండడం ద్వారానే. ప్రభువు ఆయన శిష్యులను పిలిచినప్పుడు ప్రాథమికంగా ఆయనతో ఉండడానికి పిలిచాడు (మార్కు 3:14). ప్రభువులో నిలిచి ఉండడం గురించి యోహాను సువార్త 15వ అధ్యాయంలో చెప్పబడింది. ద్రాక్ష తీగెకు శక్తి ద్రాక్షవల్లి నుండి లభిస్తుంది. ద్రాక్షవల్లిలో నిలిచి లేకపోతే తీగె జీవం లేక ఎండిపోతుంది. విశ్వాసులు ప్రభువునుండి శక్తిని పొందుతూ ఉన్నప్పుడు ఇతరులకు మనం ఆ ప్రభావం అందించగలం. శ్రమ వచ్చినప్పుడు నిలబడగలం.

షద్రక్, మేషక్, అబెద్నెగోలు అగ్నిగుండం అనే మరణకరమైన శ్రమ ఎదురుగా ఉన్నప్పటికీ వారు దేవుని సమర్థతను ఎరిగారు కాబట్టే మా దేవుడు ఈ అగ్నిగుండం నుండి తప్పించగల సమర్థుడు అని చెప్పగలిగారు. ఎంత శ్రమ ఎదురైనా భయపడని దానియేలు, తమ దేవునెరుగువారు బలముకలిగి గొప్పకార్యములు చేయుదురని అనుభవపూర్వకంగా రాశాడు. అయనను ఎరిగే వారు ఆయన చిత్తం జరిగించాలి.

**ఎదగాలి:** ప్రతి విశ్వాసి పట్ల దేవునికి గొప్ప ప్రణాళిక ఉంది. రక్షించబడిన ప్రతి వ్యక్తి పరిపక్వతలోనికి ఎదుగుతూ క్రీస్తు స్వరూపంలోకి రూపాంతరం చెందాలి. బిడ్డలు చిన్నప్పుడు ముద్దుగా ఉంటారు కానీ వారు దినదినం వృద్ధి చెందకపోతే తల్లిదండ్రులు చాలా దు:ఖిస్తారు. ఆత్మీయంగా మనం ఏయే విషయాల్లో ఎదగాలి? ముఖ్యంగా ప్రేమలోనూ, విశ్వాసంలోనూ, ప్రార్థనలోనూ, సహవాసంలోనూ, అతిథ్యంలోనూ, ఉపదేశంలోనూ, జ్ఞానంలోనూ, సమస్త జాగ్రత్తలోనూ, ఇచ్చుటలోనూ, సత్యము చెప్పుటలోనూ, మాటలోనూ, ప్రవర్తనలోనూ, పవిత్రతలోనూ, క్షమించుటలోనూ, ఇతరులను ప్రోత్సహించడంలోనూ, సహనములోనూ, విశ్వాసులు నిత్యము ఎదుగుచూ ఉండాలని రాశాడు. (ఫిలిప్పీ 1:9-11, 26; 3 యోహాను 4; 2 కొరింథీ 8:7; ఎఫెసీ 4:15; 1 తిమోతి 4:12). ఎదగడానికి, ప్రతిదినం దేవునితో ఏకాంత సమయం, కుటుంబ ప్రార్థన, వాక్యధ్యానం, వ్యక్తిగత ప్రార్థన, సంఘ సహవాసం కలిగి ఉండాలి.

**సేవ చేయాలి:** దేశంలో గణాంకాల ప్రకారం క్రైస్తవ జనాభా 3% కంటే ఎక్కువలేదు. కోత విస్తారంగా ఉంది. పని చేసేవారు తక్కువగా ఉన్నారు. మన రాష్ట్రంలో గ్రాడ్యుయేట్స్ ఎక్కువగానే ఉన్నా, కోత స్థలంలో కొద్దిమంది పనిచేస్తుంటే చాలా మంది ప్రేక్షకులుగా ఉంటున్నారు. నశించిపోయే విద్యార్థులు లక్షలమంది మన కళ్ళముందే ఉంటున్నారు? వారికి ఎవరు సువార్త చెబుతారు? నమ్మిన వారిని దేవునిలో ఎవరు స్థిరపరుస్తారు? మనము కొంత పని చేస్తుంటే సాతానుడు ఓవర్ టైం పనిచేస్తూ, జరిగే పనిని పాడుచేస్తున్నాడు. అపవాది, వాడి శక్తియుక్తులను దేవుని సహాయంతో, దేవుని శక్తితో ఎదుర్కోవాలి. అలా చేయాలంటే ఆయనను మరింత ఎరగాలి, ఆయనలో ఎదగాలి.

దేవుడు దావీదును గూర్చి అతడు నా ఉద్దేశములు నెరవేర్చేవాడని, తన తరము వారికి దేవుని సంకల్పము చొప్పున సేవచేశాడని, నేర్పరిగా నడిపించాడని ప్రశంసించాడు. పౌలు "నేను మంచి పోరాటం పోరాడితిని, నా పరుగును కడ ముట్టించితిని, విశ్వాసమును కాపాడుకొంటిని" అని చెప్పాడు. మనం కూడా దేవుని దగ్గర నుంచి ఇలాంటి సాక్ష్యాన్ని పొందాలి.

- **కె. యోహాను,** తుని

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 3 January 2024
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years)
Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

February: "Knowing…Growing….Serving"

**Note:** Please send your writeups on or before
**10th of every month**

దేవుని గురించి నేర్చుకోవడం ఆగిపోయిన రోజే
విశ్వాస జీవితం ఎదగడం కూడా ఆగిపోతుంది.

ఎదిగే విషయంలో బిజీగా లేకపోతే
చనిపోయే విషయంలో మనం బిజీగా
ఉన్నామని అర్థం.

క్రైస్తవ జీవితంలో గ్రోత్ అనేది ఆటోమేటిక్‌గా వచ్చేది
కాదు దానికి పోషణ అవసరం.

నష్టపరచుకోకపోతే ఇష్టపూర్వకంగా క్రీస్తు
మహిమకోసం సేవ చేయలేం.

తెలుసుకోవలసింది ఆయనని – క్రీస్తుని మరి
ఎక్కువగా ఎరగడం కోసం

ఎదగాల్సింది ఆయనలో – క్రీస్తుని చూపించడం
కోసం
సేవ చేయాల్సింది ఆయన కొరకే – క్రీస్తు మాదిరిని
చూపించేలా


– యం. శాంతకుమారి, హైదరాబాద్

## లోపలి పేజీల్లో...

- మన తరానికి సేవచేద్దాం - 2
- ప్రభువు ప్రణాళికలు నెరవేరాలంటే ?- 4
- ఎరగడం, ఎదగడం, ఎరిగించడం, ఎదిగించడం- 5
- ఆధ్యాత్మిక్మ పరిపక్వత - 8
- శ్రమల్లో సహానుభవం - 12
- త్యాపూరితంగా సేవ చేయడం - 16
- పశ్చాత్తాపం - 17
- హేబెలు - 20
- ఒప్పందం - 21
- సత్పంబంధాలు - 22
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి- 26
- క్షమించడం మన జీవన శైలి కావాలి - 29
- ప్రభూ, నిన్ను సేవింప నేర్పవా! - 32

# ప్రభువు ప్రణాళికలు నెరవేరాలంటే?

పవిత్రతో కూడిన ప్రగాఢమైన కోరిక ప్రభువు ప్రణాళికలను నెరవేర్చడానికి ప్రాణవాయువు లాంటిది. ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన సువార్తికుల్లో డా. బిల్లీగ్రేహం ఒకరుగా నిలిచిపోవడానికి ఒక ప్రధాన కారణం ప్రభువు కోసం ఏమైనా సాధించాలనే అతని తపన. ఈయన యాభై సంవత్సరాల పాటు ఆరు ఖండాల్లోని ఎనభైఐదు దేశాల్లో పదికోట్లమందికి పైగా క్రీస్తు సువార్తను ప్రకటించాడు. క్రీస్తు



సువార్తను ఇంత గొప్పగా ప్రపంచ దేశాల్లో ప్రకటించిన వ్యక్తి మరొకరు లేరని క్రైస్తవ మేధావుల అభిప్రాయం. ఈయన కోట్లమంది సామాన్య ప్రజలకు మాత్రమే గాక, అనేక దేశాధినేతలకు సహితం క్రీస్తు సువార్తను ప్రకటించాడు. ఇందులో మాజీ భారత ప్రధానులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీమతి ఇందిరా గాంధీ ఉండడం చాలా సంతోషకరం. గనుక 20వ శతాబ్దంలో ఒక గొప్ప సువార్త విప్లవానికి నాంది పలికిన వ్యక్తిగా ప్రపంచం ఇతన్ని పరిగణిస్తుంది.

బిల్లీగ్రేహం ఇలా తయారవ్వడానికి కారణం ప్రభువుపై తనకుండే ప్రేమతోపాటు, ప్రభువు తనను మలచిన విధానమని ప్రధానంగా చెప్పవచ్చు. చరిత్రలో దేవుని కొరకు అత్యద్భుతంగా వాడబడిన వారు, ఆయన ప్రేమను విప్లవాత్మకంగా అనేకులకు పరిచయం చేసినవారు, ఆయన విప్లవాత్మక ప్రేమతో ప్రభావితం అయినవారే. అందులో పౌలు గారు ఒకరని 'జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 'రెగ్‌కాన్స్' లో చూశాము. సువార్తను పరిచయం చేయడానికి, ప్రకటించడానికి ఉన్న తీవ్రత, పట్టుదల, దాన్ని పరిచయం చేసిన తర్వాత వ్యక్తుల్ని క్రీస్తు స్వరూపంలోకి మార్చడంలోనూ శ్రద్ధ వహించాలన్నదే మన ప్రార్థన, ప్రయాస. అందులో భాగంగా యేసును 'ఎరుగుతూ, ఆయనలో ఎదుగుతూ, ఎల్లప్పుడూ ఆయన ఆశించినట్లుగా సేవించాలని' దేవుడు పదే పదే జ్ఞాపకం చేస్తున్నాడు. ఇది కేవలం సంవత్సర ప్రారంభంలోనే గాక ప్రతి దినపు ప్రతిజ్ఞగా కొనసాగాలి. అప్పుడు మాత్రమే మన రాష్ట్రంలో ఉండే విద్యార్థుల్ని సువార్తతో సంధించడం మాత్రమే గాక, సత్యవంతుని కొరకు సాక్షులుగా తీర్చిదిద్దగలం. ఇలా జీవించాలనే కోరిక బిల్లీగ్రేహం, పౌలు గారితో పాటుగా మనం కూడా కలిగి ఉందాం. ఇలాంటి పవిత్రతతో కూడిన ప్రగాఢమైన కోరికతో ప్రభువు ప్రణాళికలను నెరవేరుద్దాం.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు

Knowing
REGCON
2024
Growing
Serving

**కవర్ కథనం**

# ఎరగడం... ఎదగడం... ఎరిగించడం, ఎదిగించడం...

ఫిలిప్పీ 3:10,11

పౌలు జీవితాశయం...

ఆయన్నెరగడం...ఇతరులు ఆయన్ను ఎరిగే విధంగా చేయడం (ఫిలిప్పీ 3:11, రోమా 15:21).

- గురి యొద్దకే పరుగెత్తుచున్నాను.
- పౌలు గురి – నేను దేని చేత (క్రీస్తు యేసు) చేత పట్టబడ్డానో దానిని పట్టుకోవాలని పరుగెత్తు చున్నాను.
- ఎలా పరిగెత్తుతున్నాడు?
  - పిక్కలు నొప్పి పుట్టేలా – నేనూ పరిగెత్తానోచ్ అన్నట్లు కాదు.
  - ఇదివరకే నేను గెలవలేదు, పట్టుకోలేదు, సంపూర్ణ సిద్ధి పొందలేదు – అన్ని సాధించిన తర్వాత.
  - వెనుక ఉన్నవాటిని మరిచి – అవి సఫలత లైనా, ఎదురు దెబ్బలైనా.
  - వేగిర పడుచు – నింపాదిగా కాదు.
  - బహుమానము పొందేలా – గురి చూడని వాని వలె కాదు. 1 కొరింథీ 9:26
  - ఉన్నతమైన పిలుపు – ఆయనను ఎరుగు నిమిత్తమును... ఫిలిప్పీ 3:11. ఆయన నెరుగని వారికి ఆయనను ఎరిగే విధంగా చేసే ..రోమా 15:21

## 1. ఎరగడం

క్రైస్తవ శిష్యత్వానికి ప్రామాణికమైన రెండు విషయాలు పౌలుకు బాగా తెలుసు. అవి దమస్కు మార్గంలో తను దేవునిని అడిగిన రెండే ప్రశ్నలకు ఆయనిచ్చిన జవాబులు – ప్రభువా, నీవెవరవు? అ.కా. 9:5, 22:10 ప్రభువా, నన్నేమి చేయమంటావ్?

**1. తనను పిలిచిన దేవుడు** – నేను నమ్మిన వాని ఎరుగుదును. 2 తిమోతి 1:12

ఎరగడం అనేది మొదటి కలయికతో మొదలై అంతం వరకూ కొనసాగుతూనే ఉంటుంది. అది నీలో మొదలైందా? ఆయన గురించి ఎరగడం కాదు, ఆయనను ఎరగడం! వినికిడి జ్ఞానం కాదు, అనుభవ జ్ఞానం. ఆయన స్వభావం, ఆయన గుణ లక్షణాలు – ఆయనెంత గొప్పవాడో, పరిశుద్ధుడో, ప్రేమగలవాడో, విశ్వసనీయుడో....అనుభవ పూర్వకంగా ఎరగడం. ఆయన్నింకా ఎరగాలంటే – ఆయనతో ప్రార్థనలో, వాక్య ధ్యానంలో సమయం గడపాలి (మార్కు 3:14,15, అ.కా 4:13). ఆయనను, ఆయన చిత్తాన్ని, ఆయన శ్రమలలో, మరణ విషయములో సమానానుభవాన్ని, ఆయన పునరుత్థానశక్తిని ఎరగడం కోసం తన ఆధిక్యతలన్నింటిని నష్టంగా, పెంటగా ఎంచుకొంటున్నాడు. తమ దేవునినెరుగు వారు బలము కలిగి గొప్ప కార్యములు చేస్తారని దానియేలు 11:32 చెప్తుంది. మరి మనం దానియేలు, షద్రక్, మేషాక్, అబెద్నెగోల్లా ఎందుకు బలం కలిగి గొప్ప కార్యాలు చేయలేక పోతున్నాం?

**2. తన పట్ల తనను పిలిచిన దేవుని ఉద్దేశ్యం** – ఆయన నన్నెందుకు పిలుచుకొన్నాడో, ఎందుకు ఎంచుకొన్నాడో నేనెరుగుదును!

పౌలు పట్ల బయలుపరచబడ్డ దేవుని ఉద్దేశం...

**ఎ. నేనేర్పర్చుకొన్న సాధనం** – అన్య జనుల యెదుటను, రాజుల యెదుటను, ఇశ్రాయేలీయుల



**పరిస్థితులన్నీ అనుకూలంగా ఉంటేనే పరిచర్య చేయడం కాదు, ఏది ఏమైనా, అనుకూల, ప్రతికూల పరిస్థితులెదురైనా నిన్నే సేవిస్తాను అని పాడతాం కదా. అలానే జీవిద్దాం - అందుకు ఎంత వెలైనా చెల్లిద్దాం. సగటు బతుకులు కాదు, దేవుని కోసం ఏమైనా చేయాలనే తపన కలిగి బదుకుదాం.**

ఎదుటను నా నామమును భరించుటకు నేనేర్పఱచుకొన్న సాధనం (అపొ.కా. 9:15-16). పౌలు ఎన్ని శ్రమలు భరించాడో మనకు తెలుసు....(2 కొరింథీ 11:23-27).

**బి. సాక్షి** - సకల మనుష్యుల ఎదుట సాక్షిగా నియమించియున్నాను (అపొ.కా. 22:14-15). సాక్షి అనే మూల పదానికి అర్థం సాక్షిగా జీవించడమంటే హతసాక్షి కావడం కూడా (అపో.కా. 1:8). అందుకే పౌలు ఫిలిప్పీ 1:21లో నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభము అన్నాడు.

**సి. పరిచారకుడు** - పరిచారకునిగా నియమించియున్నాను. అ. కా. 26:16-18

ఆయన చిత్తాన్ని ఎరగడం ఎందుకు? దాన్ని జరిగించడం కోసం. పౌలు దేవునిని, దేవుని ఉద్దేశాన్ని ఎరగడం మాత్రమే కాదు, పరిశుద్ధాత్ముని సహాయంతో దాన్ని పరిపూర్ణంగా నెరవేర్చగలిగాడు కూడా. అందుకే అంత ధైర్యంగా చెప్పగలిగాడు. 'మంచి పోరాటము పోరాడితిని. నా పరుగు తుదముట్టించితిని. నా విశ్వాసమును కాపాడుకొన్నాను'. (2 తిమో 4:7). విశ్వాసాన్ని కాపాడుకొంటిని, కానీ అందుకోసం తన ప్రాణం సైతం పోగొట్టుకొన్నాడు! అదే నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభం అంటే. మనం బతికినా ప్రభువుకోసమే బతుకుతున్నాం. చనిపోయినా ప్రభువు కోసమే చనిపోతున్నాము. కాబట్టి మనం బతికినా, చనిపోయినా ప్రభువువారమై ఉన్నాం (రోమా 14:8)

## 2. ఎదగడం

సంపూర్ణులమగుటకు సాగిపోదాం (హెబ్రీ 6:2). ఆయన్నెరిగిన మనమందరం తన కుమారుని స్వరూపంలోకి ఎదగాలని ఆయన అభిలాష (రోమా 8:29), ఆయన ఆజ్ఞ (మత్త 5:48). ఇంకా పాలు తాగే వాళ్ళుగా కాకుండా బలమైన ఆహారం తినే వారుగా ఉండాలని (హెబ్రీ. 5:12), ఆయనను గూర్చిన సంపూర్ణ జ్ఞానంలో (కొల. 1:9-12), ప్రేమలో (1థెస్స 3:12), సత్యంలో (ఎఫె. 4:14,15) ఎదగాలనీ మనల్ని ఎంచుకొన్నాడు. గాలికి అటూ ఇటూ కొట్టుకొని పోయేలా, అలల చేత అటూ ఇటూ ఎగరగొట్టబడేలా ఉండకూడదని, ప్రేమ కలిగి సత్యం చెప్తూ క్రీస్తు మనసు కలిగిన వారివలె ఉండాలని, బుల్లి క్రీస్తుల (అపో. కా. 11:26లో క్రైస్తవులు అన్న పదానికి అర్థం) నుండి క్రీస్తు సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత గల వారమయ్యే వరకూ (ఎఫెసీ 4:12) ఎదుగుతూనే ఉండాలని ఆయన ఆకాంక్ష. మన ఎదుగుదలకు కొలబద్ద, గీటురాయి క్రీస్తే! క్రీస్తు యేసుకు కలిగిన మనసు కలిగి ఉండడం - తండ్రితో సమానత్వం వదులుకొని సిలువ మరణం పొందేంతగా తగ్గించుకోవడం, తన కార్యాలకంటే ఇతరుల కార్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం.

ఆధ్యాత్మిక ఎదుగుదల అంటే - లోక భ్రష్టత్వం నుండి తప్పించబడడం మాత్రమే కాదు, దేవ స్వభావంలో పాలివారమవటం కూడా (2 పేతురు 1:4). లోక మర్యాదననుసరించక పోవడం మాత్రమే కాదు, దేవుని చిత్తాన్ని కనుగొని జరిగించడం కూడా (రోమా 12:1,2). అందుకు మన మనసు మారి రూపాంతరం చెందాలి. అందుకు మన ధ్యానం ఎల్లప్పుడూ వేటిమీద ఉంచాలో, మనం వేటిని చేయాలో కూడ ఫిలిప్పీ 4:18,19 లలో స్పష్టంగా రాయబడింది. **ఆత్మ చేత నడిపించబడటం, ఆత్మ ఫలాలు ఫలించటం మన ఎదుగుదలకు ప్రామాణికం.** క్రీస్తు శరీరంలోని ప్రతి కీలు, ప్రతి అవయవం అంటే, ప్రతి విశ్వాసి సమగ్రంగా ఎదగాలని దేవుడు కోరుకుంటున్నాడు (ఎఫె 4:15,16).

మనం ప్రార్థనలో దేవుని చిత్తాన్ని కోరుకోవడం, వాక్యధ్యానం ద్వారా మన పట్ల ఆయన చిత్తాన్ని తెలుసుకోవడం, దానికి సత్వర, సంపూర్ణ, నిరంతర విధేయత చూపించడం, మన జీవితంలో మన మేలు నిమిత్తం ఆయన అనుమతించే కొన్ని లోయ అనుభవాలు స్వీకరించడం మన ఎదుగుదలకు మార్గాలు.

## 3. ఎరిగించడం, ఎదిగించడం (సేవించడం)

మనమాయన్నింకా ఎరగడం, ఆయనలో ఇంకా

ఎదగడం, మరెక్కువ ఫలభరితమైన పరిచర్యలో ప్రతిబింబించాలి. 'మనమంతా టీచర్స్‌గా, డాక్టర్స్‌గా, ఇంజినీర్స్‌గా, బ్యాంకర్స్‌గా నైపుణ్యంగా మరుగు పరచబడ్డ క్రీస్తు సేవకులం' అంటాడు స్టువర్ట్ బ్రిస్కో అనే భక్తుడు. 'మనం రక్షించబడింది ఆయనను సేవించడానికి' అంటుంది మన యస్ఇజియఫ్ కరదీపిక. 'మన ప్రభువు ఈ లోకంలోకి వచ్చింది పరిచారం చేయడానికి' (మార్కు 10:45). మనం నిర్భయంగా, నిరంతరం, పరిశుద్ధంగాను, నీతితోను ఆయనను సేవించాలని లూకా 1:75 ద్వారా హెచ్చరించబడుతున్నాం. మనమంతా క్రీస్తు సేవకుల మని (1 కొరింథీ 4:1), క్రీస్తు నిమిత్తం ఒకరికొకరం సేవకులమని (2 కొరింథీ 4:6), క్రీస్తు మందకు కాపరులమని (1 పేతురు 5:1,2) వాక్యం స్పష్టంగా చెప్తుంది. ఒక్క విషయం మనం గుర్తు పెట్టుకోవాలి. మనం కాదు ఆయన్ని సేవించేది, ఆయనే మన ద్వారా ఆయన సేవను జరిగించుకొంటున్నాడు. ఆయన మనలో తన కార్యం చేయనివ్వకపోతే మనల్ని తన సేవలో పాలు పంచుకోనివ్వడు.

### సేవించడంలో రెండు కోణాలు

#### 1. ఇతరులకు క్రీస్తును ఎరిగింపజేయటం (Soul winning):

గత 70 సంవత్సరాల్లో బహు కొద్దిమంది కళాశాల విద్యార్థులకు మాత్రమే ఆయనను పరిచయం చేయగలిగాం. మన పద్ధతి– మొదట మన మాదిరి జీవితం ద్వారా క్రీస్తు ప్రేమను ప్రదర్శించి, హేతువు అడిగే ప్రతివానికి జవాబు చెప్పి, వారిని ఇబియస్‌కి ఆహ్వానించి వారానికో కోణంలో సువార్తనందించి, ఓ గాస్పల్ మీటింగ్‌కి ఆహ్వానించి తన గత జీవితం పట్ల రోతతో, నిజమైన పశ్చాత్తాపంతో, ప్రభువు ప్రేమకు ముగ్ధుడై ప్రభుని తన హృదయంలోకి స్వీకరించేలా చేయడం. ఇది మన కార్యం కాదు. పరిశుద్ధాత్మ మన ద్వారా ఇతరుల్లో జరిగించే క్రియ. రక్షించబడిన ప్రతి ఒక్కరిని ఆత్మల సంపాదకులుగా చేద్దాం.

#### 2. రక్షించబడిన వారిని క్రీస్తు స్వారూప్యంలోనికి ఎదిగింపజేయడం (Discipling):

మనలో ప్రతి ఒక్కరం ఇంకో కొత్త విశ్వాస విద్యార్థిని దత్తత తీసుకొని వారిపట్ల ప్రత్యేక శ్రద్ధతో వారిని క్రీస్తు సారూప్యంలోనికి ఎదిగింపజేయాలి. అదే మన పితరులు చూపించిన మార్గం. వారి విలువల్ని, దర్శనాన్ని అందుకొంటూ, అనుసరిస్తూ, తరవాతి తరానికి అందిస్తూ సాగిపోదాం. జీవించినంతకాలం దున్నుతూనే ఉందాం, అవసరమైతే బలిగా అర్పించబడడానికి సిద్ధంగా ఉందాం మరో జోసఫ్ అభిషేకరావులా!

### సేవలో సఫలతకు దైవిక సూత్రం

విజ్ఞాపన (Supplication), విధేయత (Submission), శ్రమ (Suffering) = విజయం (Salvation to all) – హెబ్రీ. 5:7–10.

ఇది ప్రభువు అనుసరించిన మార్గం. మన ప్రభువు వెళ్ళిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో సఫలత సాధించాలనుకోవడం ఆయన శిష్యులమైన మనకు భావ్యం కాదు. ఆయనను సంప్రదిద్దాం, ఆయనిచ్చే సలహాకు లోబడదాం, ఆయన కోసం శ్రమ పడదాం, ఆయనిచ్చే సఫలతను పొందుకొందాం. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉంటేనే పరిచర్య చేయడం కాదు, ఏది ఏమైనా, అనుకూల, ప్రతికూల పరిస్థితులెదురైనా నిన్నే సేవిస్తాను అని పాడతాం కదా. అలానే జీవిద్దాం – అందుకోసం వెలైనా చెల్లిద్దాం. చెల్లించే వెల కన్నా పొందే బహుమానం గొప్పదని గుర్తిద్దాం. అయినా మనం సేవించేది బహుమానం కోసం కాదుగా, ఆయన మన పట్ల చూపిన ప్రేమకు ప్రతిస్పందనగా సేవిస్తున్నాం. సగటు బతుకులు కాదు, దేవుని కోసం ఏమైనా చేయాలనే తపన కలిగి బ్రదుకుదాం. ఆయనను సేవించడం అనేది దేవదూతలకు కూడా లేని మహద్భాగ్యం, మహాధిక్యత. అందుకు మనల్ని ఎంచుకొన్నందుకు మనమెంతో ధన్యులం.

క్రీస్తు యేసునందున్న కృప చేత బలవంతుల మై ఆయనను ఇంకా ఇంకా అనుభవ పూర్వకంగా ఎరుగుదాం! ఆయన కుమారుని స్వరూపంలోకి ఇంకా ఇంకా ఎదుగుదాం! ఇతరులకు ఎరిగింపజేద్దాం! ఇతరుల్ని ఎదిగింప చేద్దాం! అదీ పరిచర్యంటే!

ఈ ఎరగడం, ఎదగడం, ఎరిగించడం, ఎదిగించడం యొక్క ప్రధాన ధ్యేయం త్రియేక దేవుని మహిమే!

ఆయన్నింకా ఎరిగే ప్రక్రియలో, ఎదిగే ప్రక్రియలో, ఎరిగించే ప్రక్రియలో, ఎదిగించే ప్రక్రియలో ముందుకు సాగిపోదుము గాక. మనలో ఈ సత్క్రియ ఆరంభించిన వాడు దానిని కొనసాగించి ముగిస్తాడు.

– పి. జాన్ విక్టర్, కర్నూలు


ప్రత్యేకం

# ఆధ్యాత్మిక పరిపక్వత

## ఫిలిప్పీ 3:17-22

ఫిలిప్పీయులకు రాసిన పత్రిక ఆధారంగా ఎరగాలన్నా, ఎదగాలన్నా, సేవచేయాలన్నా లోపల ఉండవలసినవి పరిశుద్ధ కోరికలు. అపోస్తులుడైన పౌలు ఎరగడానికి, ఎదగడానికి, సేవ చేయడానికి తన లోపల ఉన్న పరిశుద్ధ కోరికలు ఏ పుస్తకములో కూడా అంత విస్తృతంగా రాయలేదేమో అన్నట్టుగా ఏడు మంచి కోరికలు తనలో ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. (ఫిలిప్పీ 1:20, 23; 2:16; 3:9,10). ఈ ఆశలు అనేవి రూట్స్ లాంటివి. రూట్స్ బాగుంటేనే ఫ్రూట్ బాగుండేది, కనుక మన ప్రభువైన దేవుడు రూట్స్ మీదే లక్ష్యపెట్టేవాడు. ఎదుగు, బొదుగు లేనివారు లోకం నవ్వుకోవడానికి, దేవునిని దుఃఖ పెట్టడానికే పనికొస్తారు. గనుక మనం ఎదగాలి. ఎదగడానికి మన దగ్గర సరైన వైఖరి మన దగ్గర ఉండాలి, వైఖరి ఉంటే సరిపోదు, సరైన ప్రయత్నాలు చేయాలి, సరైన దృష్టిపెడుతూ జీవించాలి. సరైన అభ్యాసాలు చేయాలి. అప్పుడు మనం ఆత్మసంబంధమైన పరిపక్వతకు వస్తాము.

ఫిలిప్పీ 3:17-22 వాక్యభాగాన్ని చదువుదాం. సంపూర్ణత అనే మాట పౌలు సాహిత్యంలో కనిపిస్తుంది. ఈ మాట వినగానే మనలో కొంతమంది మనసులో యే పాపం లేకుండా ఉండడమేమో అని అనుకొంటారు. పౌలు మాట్లాడుతున్న సంపూర్ణత అనే మాటకు తాత్పర్యం ఏంటంటే, ఏ పాపము లేకుండా ఉండడమని కాదు ఆత్మ సంబంధంగా మనం పరిపక్వత చెందడం, ఆధ్యాత్మికంగా ఎదగడం. అపొస్తులుడైన పౌలు, సంఘపితరులు విశ్వాసులందరినీ ఈ సంపూర్ణత లోనికి, అనగా ఆధ్యాత్మిక పరిపక్వత లోనికి తీసుకొని రావడం కొరకే వారు సేవ చేశారు. ఇలా చేయడానికి కారణం బైబిల్‌లోని దేవుని లక్ష్యం వారికి అర్థం అయింది. అందుకనే వారి గురి ఏదో ఒక చిన్న



కూడిక నిర్వహించి మేము సాధించేశాము అని వారనుకోలేదు, కొంతమందిని శిష్యులుగా తయారు చేసి మేమేదో సాధించామని వారు అనుకోలేదు, కొంతమంది నాయకులను సిద్ధపరిస్తే సాధించాల్సిన పని అయిపోయింది అని అనుకోలేదు. వారికి అర్థం అయింది ఏంటంటే వారు ఆరాధించి, పూజిస్తున్న ఈ దేవుడు మనుషుల పట్ల ఎటువంటి ఉద్దేశం కలిగి ఉన్నాడో వారు చాలా స్పష్టంగా అర్థం చేసుకొన్నారు. అందుకనే వాళ్ళ లక్ష్యం ఆధ్యాత్మిక పరిపక్వత లేదా క్రీస్తు యొక్క సంపూర్ణత లోకి మనుషులను తేవడానికి వారు పరిచర్య చేశారు. అందుకనే వారి దగ్గర ఆరోగ్యకరమైన అసంతృప్తి ఉండేది... మనం నమ్మిన దేవుడు ఒక్కడే కానీ ముగ్గురు వ్యక్తులుగా తనను తాను సాక్ష్యాత్కరించుకొన్నప్పుడు ఆ ముగ్గురు వ్యక్తుల అభిమతమేంటో నేను మీకు జ్ఞాపకం చేస్తాను.

మొదటిగా రోమా పత్రిక 8:29లో "ఎందుకనగా

తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్టుడు అగునట్లు దేవుడు ఎవరిని ముందు ఎరిగెనో వారు తన కుమారునితో సారూప్యం కలవారగుటకు వారిని ముందుగా నిర్ణయించెను.

తండ్రియైన దేవుని ఆకాంక్ష ఈ భూమ్మీద మనుష్యులంత తన కుమారుడి సారూప్యంలోకి రావాలి అన్నది తండ్రియైన దేవుని ఆకాంక్షగా ఆ వచనం చెబుతుంది. రెండవదిగా కుమారుడైన యేసుక్రీస్తు ఆకాంక్ష ఏంటంటే.. "మన మందరము విశ్వాస విషయంలో అలాగే దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయంలోనూ, ఏకత్వం పొంది సంపూర్ణ పురుషులము అగువరకు అనగా క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత గల వారమగు వరకు ఆయన ఈలాగు నియమించెను (ఎఫెసీ 4:11-13). సంఘం అనబడిన ఈ వ్యవస్థకు అపొస్తులులను, ప్రవక్తలను, సువార్తి కులను, కాపరులను, ఉపదేశకులను నియమించి ఈ మనుష్యులందరు కూడా తనకు కలిగిన సంపూర్ణతకు, సమానమైన సంపూర్ణత కలిగి ఉండాలని వారిని నియమించెను. కుమారుని సంపూర్ణతకు సమానమైన సంపూర్ణతలోకి అందరూ రావలన్నది కుమారుని అభిలాష. మరి పరిశుద్ధాత్మ దేవుని ఆశ, ఆకాంక్ష ఏంటి? "మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీ 3:18). పరిశుద్ధాత్మ దేవుని పని, ఆశ ఏంటి అంటే యేసునందు విశ్వాసముంచిన ప్రతి మనుషుడు కూడా యేసులాంటి పోలికతో ఉండాలని ఆయన పని చేస్తున్నాడు. తండ్రి కోరిక మనము కుమారుని స్వారూప్యంలోనికి రావాలని, కుమారుని ఆశ ఆయన కలిగిన సమాన సంపూర్ణత లోనికి రావాలని, పరి శుద్ధాత్మ దేవుని ఆశ మనము యేసు క్రీస్తు పోలిక లోనిక రావాలని. ఈ మూడు విషయాలు ఆనాటి అపోస్తులలకు, సంఘ పితరులకు అర్థమయ్యింది కనుకనే వారు సేవలో చాలా అసంతృప్తిగా కనబడుతూనే వచ్చారు. కొంతమందికి సువార్త చెబితే, కొంతమందిని రక్షణలోకి తీసుకొని వస్తే, కొంతమందిని శిష్యులు గా చేస్తే నా సేవ అయిపోయింది అని వాళ్ళు అనుకోలేదు. వారు ఏ ఉద్దేశంతో ఆ పని చేశారో పౌలు ఇలా తెలియజేస్తున్నాడు. "ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణునిగా చేసి ఆయనయెదుట నిలువబెట్టవలెనని, సమస్తవిధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికి మానక బుద్ధిచెప్పుచు, ప్రతి మనుష్యునికి బోధించుచు, ఆయునను ప్రకటించుచున్నాము" (కొలస్సీ 1:28). మా దగ్గర మూడు రకాల పరిచర్యలు ఉన్నాయి అని ఉంటున్నాడు. మొదటి పరిచర్య కౌన్సిలింగ్, రెండవది టీచింగ్, మూడవది ప్రీచింగ్. ఈ మూడు పరిచర్యలు ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణులుగా చేయడానికే చేస్తు న్నాము. సువార్త చెబితే, సంఘం స్థాపిస్తే, కొద్దిమంది శిష్యులనుగా, నాయకులుగా చేస్తే మా పరిచర్య అయిపోయిందని మేము అనుకోము అని పౌలు ఉద్దేశం.

మన పరిచర్య విషయానికొస్తే నాయకులుగా, వరములు, వనరులు కలిగిన వ్యక్తులుగా విద్యార్థుల మధ్య పరిచర్య చేస్తున్నప్పుడు దేవుడు మనకప్పగిం చిన తమ్ముళ్ళను, చెల్లెళ్ళను క్రీస్తునందు సంపూర్ణులు గా చేయాలి, నేను క్రీస్తు సారూప్యంలోకి రావాలి, దేవుడు నాకిచ్చిన పిల్లలను క్రీస్తు సారూప్యతలోకి తేవాలనే గొప్ప లక్ష్యంతోనే ఉద్యమంలో ఉన్నామా? మనం జరిపే ఇ-క్యాంప్‌లో కొంతమంది దేవునిని అంగీకరిస్తే వారు ఫాలోఅప్‌లో, డిటిలో కనిపించరు. డిటికి వచ్చిన పిల్లలు యల్‌టి క్యాంప్‌లో కనపడరు. చివరికి ఔట్‌గోయింగ్ స్టూడెంట్స్ ఇద్దరు, ముగ్గురే మిగులుతున్నారు. అందుకే మన రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్య కన్నా గ్రాడ్యుయేట్స్ సంఖ్య ఎక్కువగా ఉంది. ఇది విచారకరమైనది. ఎక్కడో మన గురి, మన లక్ష్యం పలచబడింది. సువార్త చెప్పాం, డిటికి, యల్‌టికి తీసుకెళ్ళాం. డాక్ట్రిన్స్, డివోషన్స్, ప్రాక్టికల్ టాక్స్ ఎన్నో చెప్పాము కానీ వారిని మనం ప్రభువు సారూప్యతలోనికి నడిపించామా? వారు ప్రభువు పోలికలో ఎదుగుతున్నారా? లేదా అని ఆలోచించాలి. లేకపోతే వారిని క్రీస్తు సంపూర్ణతలోనికి నడిపించడానికి మనము ప్రసవవేదన పొందాలి (గలతీ 4:19). అసలు నీ మనసులో, ప్రార్థనలో, మనకు అప్పగించబడిన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? వారి కొరకు నీవు దేవుని దగ్గర పడుతున్న ప్రసవవేదన ఏంటి?

డియల్ మూడీ వృద్ధాప్యంలో తన భార్యతో కలిసి మంచంమీద పడుకొన్నాడు. భార్య మధ్యరాత్రిలో

ఆయన మీద చేయివేస్తే చేతికి తగలడంలేదు. ఏ మైపోయాడనుకొని వాష్‌రూమ్‌లో, బయట చూస్తూ గదిలో లైట్ వేస్తే ఆయన కింద పడుకొని అటు, ఇటు దొర్లుతున్నాడు. కడుపునొప్పో, గుండెనొప్పో అని గాభరాపడి లేపి అడిగింది. అందుకు డియల్ మూడి "మన ఫెలోషిప్‌కి వస్తున్న కొంతమందిలో క్రీస్తు సారూప్యం లేదు. వారికొరకు మధ్యరాత్రిలో మంచం దిగి ప్రార్థిస్తూ ప్రసవవేదన పడుతున్నాను" అని చెప్పాడు.

మనలో, మనతో ఉంటున్న చాలామంది విద్యార్థుల్లో క్రీస్తు సారూప్యత లేదు, కనబడడంలేదు. మనకి టీచింగ్, ప్రీచింగ్, రకరకాల సందేశాలు, బైబిల్ స్టడీస్, కమిటీ మెంబెర్స్, రిసోర్స్ పర్సన్స్, ఫెలోషిప్ అన్నీ ఉన్నాగాని మనం ఇంకా క్రీస్తు సారూప్యతలోనికి రావడం లేదు. ఎక్కడో ఏదో అలసత్వం, కొంత గ్యాప్ ఉంది. ఆలోచించుకొందాం.

### పరిపక్వతలోకి రావాలంటే దైవిక మాదిరి మీద దృష్టి పెట్టాలి - (ఫిలిప్పీ 3:17)

"నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరు నన్ను పోలి నడుచుకొనుడి" అని 1 కొరింథీ 11:1లో కూడా చెప్పాడు. ఆధ్యాత్మిక పరిపక్వతలోకి రావాలంటే ముందు మనం దైవిక మాదిరులను అనుసరించాలి. ఈ క్రమములో దైవిక మాదిరి ఎవరో ముందు కనుగొనాలి. ఎవరు పడితే వారు మనకి మాదిరి అవ్వరు, వారి కోసం ప్రార్థన చేయాలి. దేవుడు మనకు సరైన మాదిరులను మన ముందు ఉంచితే, వారి జీవితం, వారి ప్రార్థన, వారి సాక్ష్యం, వారి సౌవార్తీకరణ, వారి దైనందిన జీవితం, వారి పరిచర్య అన్ని మనకు మాదిరి అవుతాయి. ఇజియఫ్‌లో ఉన్న సహోదరీ, సహోదరులకు నాదొక ప్రశ్న, నీకు ఎవరైనా ఒక వ్యక్తి మాదిరిగా ఉన్నాడా? నీ ఆధ్యాత్మిక జీవితానికి రోల్ మోడల్ ఎవరు? మనకు మాదిరులు కావాలి.

ఫిలిప్పీ రెండవ అధ్యాయంలో మనము అనుసరించడానికి మాదిరిగా నలుగురు ఉన్నారు.

#### 1. యేసుక్రీస్తు ప్రభువు (ఫిలిప్పీ 2:5-11)

మొదటి మాదిరి ఎవరంటే మన ప్రభువైన యేసుక్రీస్తు, మీరు క్రీస్తును వెంబడించండి అని పౌలు అంటాడు. నాకు, మనకు ఆయనే మంచి మాదిరి.



ఈ వచనాల్లో యేసుక్రీస్తు మాదిరిని చెప్పడానికి పౌలు ఎంచుకున్న ఒకే ఒక్క అంశం కెనోసిస్ (రిక్తత). గ్రీకు భాషలో 'కెనోసిస్', ఆంగ్లంలో 'ఎమ్టైడ్ హిమ్‌సెల్ఫ్, తెలుగులో 'రిక్తత' అన్నారు. రిక్తత అంటే ఇష్టపూర్వకంగా, స్వచ్ఛందంగా, ఎవరి ప్రమేయం లేకుండా తనకు తానుగా మరొక మనిషికి తాను దాసునిగా ఉండడానికి, తగ్గించుకోవడానికి ఇష్టపడడం. ఫిలిప్పీయులతో పౌలు "మీకు ఎందుకు గొడవలు వస్తున్నాయి, మీకు ఏకమనసు, ప్రేమ ఎందుకు లేదు అంటే మీ మధ్య రిక్తులు లేరు. పన్నెండుమంది శిష్యులు ఆయన కలిసి మేడమీద పస్కా పండుగ ఆచరించడానికి వచ్చారు. ఎవరు కాళ్ళు కడుగుతారు? ఎవరూ ముందుకు రానప్పుడు ఆయన తన పై వస్త్రాన్ని తీసి నడుముకు కట్టుకొని శిష్యుల పాదాల వరకు వంగి పాదాలు కడిగాడు. అలా చేయడానికి ఎవరు బలవంతం చేశారు? ఆయనలో ఉన్న రిక్తత నైజం మరో మనిషికి పరిచారకునిగా ఉండేటట్లు చేసింది. స్వచ్ఛందంగా సేవ చేశాడు. మనుష్యకుమారుడు పరిచర్య చేయించుకోవడానికి రాలేదు కానీ పరిచర్య చేయడానికే వచ్చాడు. మరో వ్యక్తికి నేను పరిచారకుడిననే మనస్తత్వం వస్తుందా? లేదా ఒక వ్యక్తి మీద నేను యజమానిని అనే మనస్తత్వం వస్తుందా? ఒక వ్యక్తిలో రిక్తత అనుభవంలోకి రానంతకాలం అతను బోధించడానికి, నాయకత్వనికి అనర్హుడే.

#### 2. అపొస్తలుడైన పౌలు (ఫిలిప్పీ 2:17)

"మరియు మీ విశ్వాసయాగములోనూ, దాని సంబంధమైన సేవలోనూ; నేను పానార్పణముగా పోయబడినను, నేను ఆనందించి మీ అందరితోకూడ సంతోషింతును". పౌలు యొక్క మాదిరి త్యాగం చేయడం. అన్ని అర్పణలలో చివరి అర్పణం పానార్పణమే. నేను మీ కొరకు పానార్పణముగా

పోయబడుచున్నాను. అపొకా. 20: 24లో "అయితే దేవుని కృపాసువార్తను గూర్చి సాక్ష్యమిచ్చుటయందు నా పరుగును, నేను ప్రభువైన యేసువలన పొందిన పరిచర్యను, తుదముట్టింపవలెనని నా ప్రాణమును నాకెంత మాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొనుటలేదు. 2 కొరింథీ 12:15లో "కాబట్టి నాకు కలిగినది యావత్తు మీ ఆత్మలకొరకు బహు సంతోషముగా వ్యయ పరచెదను నన్ను నేను వ్యయపరచుకొందును" అంటాడు.

ప్రారంభదినాల్లో గ్రాడ్యుయేట్స్ పరిచర్యకోసం ఎంతో త్యాగం చేసేవారు. ఆత్మల కొరకు తమ్మును తాము, సమస్తాన్ని వ్యయపరచుకొన్నారు. ఈరోజుల్లో భక్తి భక్తే, సంపాదన సంపాదనే. ఎవరి అవసరం గురించి తెలిసినా, అలాగే బ్రదర్ ప్రార్థన చేద్దాం అని అంటారే గానీ త్యాగం చేయరు. ఉండి కూడా పరిచర్యకు ఇవ్వరు. పౌలు మాదిరిలో ఖర్చైపోవడం, ఆత్మల కొరకు వ్యయపరచుకోవడం నేర్చుకోవాలి.

### 3. తిమోతి (ఫిలిప్పీ 2:20)

"మీ క్షేమవిషయమై నిజముగా చింతించువాడు అతని వంటివాడెవడును నాయొద్ద లేడు. అందరును తమ సొంత కార్యములనే చూచుకొనుచున్నారు గాని, యేసుక్రీస్తు కార్యములను చూడరు". తిమోతి మాదిరి అతను ఎవరికైనా సహాయం చేసే మనసుగలవాడు. తోటి మనిషికి సహాయ పడని దేవుని సేవకుడు సేవ చేయడానికి అనర్హుడు. దేవుని సేవకుడు ఇతరుల క్షేమాల కొరకు త్యాగం చేయాలి. ఇజియఫ్ సర్కిల్‌లో ఉన్న మీరు ఎవరికైనా సహాయపడే మనస్సు ఉన్నవారేనా?

ఇది 18,19 శతాబ్దంలో జరిగిన విషయం. ఒకాయన పేరు ఫ్రేరీ, గవర్నమెంట్ తరఫున ఇంగ్లాండ్ నుంచి ఇండియాకి వచ్చాడు. మంచి విశ్వాసి. ముంబయిలో ఉంటూ దగ్గర దగ్గరగా 28 సం॥లు ఉండిపోయాడు. తిరిగి ఆయన బయలు దేరి వెళ్ళాలి. అమ్మకు ఉత్తరం రాశాడు. అమ్మా నేను లండన్‌కి వచ్చేస్తున్నాను ఫలానా దగ్గరికి వచ్చి, అక్కడి నుండి ట్రైన్‌కి వస్తున్నాను, నా లగేజ్ కొంచెం ఎక్కువగా ఉంది. మరలా ఇండియాకి తిరిగి వెళ్ళే పనిలేదు. టాంగా వాడిని పంపించు లగేజ్ తీసుకొని వస్తాను అని అన్నాడు. సరే ఆరోజు రానే వచ్చింది. వాళ్ళ అమ్మ గుర్రపు బండి వాణ్ణి పిలిచి, మా అబ్బాయి ట్రైన్‌కి వస్తున్నాడు, లగేజ్ తీసుకొని రమ్మని చెప్పింది. అప్పుడు ఆ బండి వాడు మీరు వస్తారా? అని అడిగాడు. నేను రాను అని చెబుతుంది. మీ అబ్బాయి ఎలా ఉంటాడు? అని అడిగినప్పుడు గోడ మీద చిన్నప్పటి ఫోటో ఉంటే చూపిస్తుంది. అతను ఇప్పుడు ఆ అబ్బాయి ఇలాగే ఉంటాడా మేడం అని అన్నాడు. వాడు ఇప్పుడు ఇలా ఉండడు చాలా పెద్దవాడై ఉంటాడు, నా వయసే 87, వాడి వయసు 60పైన ఉంటుంది. మరి ఎలా పోల్చుకొనేది అంటే "నా కొడుకును పోల్చుకోవడం చాలా తేలిక. రైల్వేస్టేషన్‌లో నీవు ఒక వ్యక్తిని చూస్తావు. అతను మరొక వ్యక్తికి సహాయపడుతూ ఉంటాడు. అతనే నా కొడుకు" అని చెబుతుంది. ఆ గుర్రపు బండివాడు రైల్వేస్టేషన్‌కు వెళ్ళినప్పుడు ఒక ముసలివ్యక్తి తను బరువులు మోస్తూ, మరొక వ్యక్తికి సహాయపడుతుంటే, ఇతను దగ్గరికి వెళ్ళి మీరు ఫ్రేరీనా అడిగితే అవును అని చెబుతాడు. ఎలా నన్ను గుర్తుపట్టావు అని అడిగితే మీ అమ్మ సహాయపడుతూ ఉండేవాడే నాకొడుకు అని చెప్పింది' అని చెప్తాడు.

### 4. ఎపఫ్రొదితు (ఫిలిప్పీ 2:29)

"నాయెడల మీ ఉపచర్యలో ఉన్న కొదువను తీర్చుటకై అతడు తన ప్రాణమునైనను లక్ష్య పెట్టక క్రీస్తుయేసు పని నిమిత్తము చావునకు సిద్ధమైయుండెను". క్రీస్తు పని నిమిత్తము ప్రాణము సహితము లెక్కపెట్టకపోవడం ఎపఫ్రొదితు మాదిరి.

ఫిలిప్పీ 3:17లో "సహోదరులారా, మీరు నన్ను పోలి నడుచుకొనుడి; మేము మీకు మాదిరి యైయున్న ప్రకారము నడుచుకొను వారిని గురి పెట్టి చూడుడి". నీకు మాదిరి ఎవరు? వారు ఎలాంటి వారు? పరిచారకుని వంటి మనసుగల వారేనా నీ మాదిరి? ఆత్మల కొరకు తమను తాము వ్యయపరచుకొన్న వారేనా నీ మాదిరి? ఎవరికైనా సహాయపడే మనసుకలిగిన వారేనా నీ మాదిరి? క్రీస్తు నిమిత్తం ప్రాణము సహితము లెక్కపెట్టని నైజం కలిగిన వారేనా నీ మాదిరి.

మిగిలినది వచ్చేసంచికలో...

– పి.ఏ.స్వామి, శ్రీకాకుళం
(సదరన్ సర్కార్స్ రెగ్‌కాన్-2024 మూడవ డివోషన్)
కూర్పు: ఆర్. లక్ష్మీకాంత్, అచ్చంపేట

ప్రత్యేకం

# శ్రమల్లో సహానుభవం

"ఏ విధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణవిషయములో సమానానుభవముగలవాడనై, ఆయనను ఆయన పునరుత్థానబలమును ఎరుగు నిమిత్తమును, **ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును,** సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను" – (ఫిలిప్పీ 3:10,11).



దేవునితో సహవాసం చేయడంలో శ్రమల్లో కూడా పాలిభాగస్తులుగా ఉండడం అంటే ఏంటో చూద్దాం. దేవునితో సహవాసం, శ్రమలు అనే విషయాల్ని చూసినప్పుడు అవి రెండు ఒకదానికొకటి పొంతనలేని విషయాల్లాగా కనిపిస్తాయి. సహవాసం అంటే సాన్నిహిత్యం, దేవునితో కలిసి నడవడం, దేవునితో ఆనందకరమైన సంబంధం అని అనుకొంటాము. సహవాసం, శ్రమలు రెండిటిని కలిపి చూడము. పౌలు శ్రమల్లో సహానుభవం కలిగి ఉండడం అనే సంగతిని తెలియజేస్తున్నాడు.

## సంపూర్ణంగా ఎదగాలని దేవుని ప్రణాళిక

ఫుల్లర్ థియలాజికల్ కాలేజ్‌లో ఫ్యాకల్టీగా పనిచేసే రాబర్ట్ క్లింటన్ ఇలా చెబుతాడు "క్రీస్తు క్రైస్తవ పరిచర్యకు నాయకుల్ని పిలిచినప్పుడు వారి పూర్తి సామర్థ్యానికి అభివృద్ధి చేయాలని ఆయన సంకల్పించాడు". దేవుడు ఒక వ్యక్తిని క్రైస్తవ నాయకత్వానికి పిలిచినప్పుడు ఆ నాయకుణ్ణి సంపూర్ణంగా తయారు చేయడానికి ఇష్టపడతాడు. మనల్ని మనం పరిచర్యకు అప్పగించుకొంటున్నామంటే "ప్రభువా మీరు నన్ను ఎంతవరకు అభివృద్ధి చేయగలరో అంతవరకు చేయండి అని ఒప్పుకోవడం". మనందరిలో గొప్ప శక్తి, సామర్థ్యాలు దాగి ఉన్నాయి. వాటి గురించి మీతో ఒక సంఘటనను చెబుతాను.

నేను ఒక వర్క్‌షాప్‌కు వెళ్ళాను. దానిలో ఒక ఫ్యాకల్టీ ఒక గుడ్డును చూపిస్తూ ఈ గుడ్డు వెల ఎంత అని అడిగారు? మేమందరం 3,4,5 రూపాయలు అని చెప్పాము. అందుకాయన మీరందరు దీని వెల 5 రూపాయలు అని చెబుతున్నారు ఒకవేళ నేను గుడ్డును పొదిగించి కోడిపిల్లగా చేసినట్లయితే దాని వెల ఎంత ఉంటుంది? అని అడిగితే దాని ధర 300-400 రూపాయలు పెరిగే అవకాశం ఉంది అని చెప్పాము. ఒకవేళ పిల్ల పెరిగి పెద్దయి అదికూడా గుడ్లు పెట్టి పొదిగితే దాని వెల ఎంత అవుతుంది? 10,000 అంతకంటే ఎక్కువ అవ్వొచ్చు అని చెప్పాము. మరలా ఆయన వాటి గుడ్లు పొదిగించి వాటిని పిల్లల్ని చేస్తే వాటి ధర ఎంతవుతుంది? అని అడిగాడు. అప్పుడు దాని ధర లెక్కించడం కష్టమై, అనంతమవుతుంది అని చెప్పాము. మీరు ప్రారంభంలో దీని విలువ 3-5 రూపాయలని చెప్పారు. ఇప్పుడు అనంతమవుతుంది అని చెబుతున్నారు అంటూ ఒకడుగు వెనక్కేవేసి బలంగా ఆ గుడ్డును నేలకేసి కొట్టాడు. అందరం షాక్ అయ్యాం. మీరందరూ దీని విలువ అనంతమని చెప్పినా దాన్ని జీరోగా మార్చాను అని చెప్పాడు.

ఒకవేళ దేవుడు ఒక గుడ్డుకే అంత విలువను ఇచ్చినట్లయితే నీలో నాలో ఎంత సామర్థ్యాన్ని, విలువను దేవుడు ఉంచాడు? ఈ మాటలకు ఒక్కసారిగా నేను చలించిపోయాను. దేవుడు మనందరిలో గొప్ప శక్తి, సామర్థ్యాల్ని ఉంచాడు. చాలామంది దేవుడిచ్చిన శక్తిని, సమయాన్ని, జీవితాన్ని వ్యర్థం చేస్తున్నారు. దేవా నా పూర్తిసామర్థ్యాన్ని నాలో అభి

వృద్ధిపరచమని అడగము. పరిచర్య అనేది మనం దేవునికి అప్పగించుకొని సంపూర్ణంగా ఎదగడం అనే దానిమీద ఉంటుంది. ఒకవేళ మనం ఎదగడానికి ఇష్టపడకపోతే పరిచర్యకు అడ్డుబండలం అవుతాం. దేవా నన్ను సంపూర్ణంగా ఎదిగేటట్లు చేయండి. నా జీవితాన్ని వృధా చేయడం నాకు ఇష్టంలేదు. నేను గొప్పవాడిని కావడానికి కాదు గానీ నన్ను ఏ ఉద్దేశ్యంతో సృష్టించారో ఆ విధంగా తయారవ్వాలని కోరుకొంటున్నానని తీర్మానం చేసుకొండి.

## ఎదగడంలో మన బాధ్యత ఉండాలి

క్రైస్తవ నాయకుల్ని పిలిచినప్పుడు వారిని సంపూర్ణంగా తయారు చేస్తాడన్నది రాబర్ట్ క్లింటన్ చెప్పిన స్టేట్‌మెంట్‌లో సగం మాత్రమే. రెండవ భాగం "ఎదగడంలో మన బాధ్యత కూడా ఉండాలి" అని చెబుతాడు. దేవుడు మనల్ని జీవిత కాలం తయారు చేస్తున్నప్పుడు, ఆయనకు సంపూర్ణంగా లోబడడం మన బాధ్యత. దేవుడు మనల్ని మలచడమనేది అంత సులభంగా ఉండదు. ఇక్కడ మనకు అనేక కష్టమైన, ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. మనలో చాలామంది వీటిని ఇష్టపడక, దేవా ఎందుకు ఈ కష్టమైన పరిస్థితుల్ని అనుమతిస్తున్నారని అగుడుతూ ఉంటారు. నిన్నునేను తయారు చేస్తున్నాను అని, దేవుడు మనల్ని ఇంకా అద్భుతంగా తయారు చేస్తాడు. గనుక శ్రమల్ని అనుభవించడానికి సిద్ధంగా ఉండాలి. దీన్ని అపొస్తలుడైన పౌలు 'శ్రమల్లో సహానుభవం కలిగి ఉండడం' అని చెబుతాడు.

## శ్రమలు సంపూర్ణత కోసమే

"నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి. మీరు సంపూర్ణులును, అనునాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి" (యాకోబు 1:2-4).

మీరు శ్రమల్లో ఉన్నప్పుడు దాన్ని సంతోషంగా ఎంచుకోమని యాకోబు చెబుతున్నాడు. మనమందరం శ్రమల్ని ఎదుర్కొంటాం. ఈ సమయంలో ప్రభువా ఈ శ్రమల్ని నా నుంచి తీసివేయమని అడుగుతాము లేదు సగుణుతాము, కొన్నిసార్లు ఫిర్యాదు చేస్తాము. దేవా ఎందుకు నా జీవితంలో ఇలాంటివి అనుమతిస్తున్నారు? వీటికి కారణమైన పరిస్థితులను, ప్రజలను నిందిస్తాము. కానీ యాకోబు ఆశ్చర్యకరమైన సంగతుల్ని చెబుతున్నాడు. శ్రమల్లో పడినప్పుడు సంతోషించమని చెబుతున్నాడు. దీన్ని చూసినప్పుడు యాకోబుకు శ్రమలు తెలియదని, ఈ భూనివాసి కాదేమో, వేరే గ్రహాంతర వాసేమోనని, వాస్తవికతకు దూరంగా ఈ సంగతుల్ని చెబుతున్నాడేమోనని అనిపిస్తుంది. యాకోబు ఈ పత్రిక రాసినప్పుడు మొదటి శతాబ్దంలో సంఘంలోని విశ్వాసులు కఠిన మైన శ్రమల్ని ఎదుర్కొంటున్నారు. ఎందుకు ఈ శ్రమలు అంటే, మనం సంపూర్ణంగా ఎదగడానికి, తయారవ్వడానికి దేవుడు వీటిని వాడుకొంటున్నాడు. గనుక శ్రమలు వచ్చినప్పుడు దేవుడు నన్ను సంపూర్ణంగా తయారు చేస్తున్నాడని, ఆయన పరిచర్యలో ఒక పనిముట్టుగా ఉపయోగపడాలనే ఉద్దేశంతో తయారు చేస్తున్నాడు. ఇకమీదట 'నేను సమస్యలో గుండా వెళ్తున్నప్పుడు నేను సణగను' అని చెప్పాలి.

## శ్రమల్లో విధేయత చూపించాలి, రాజీపడ కూడదు

మనం క్రైస్తవ ప్రయాణంలో సంపూర్ణత కొరకైన పరీక్షలు, శ్రమలు ఎదుర్కొంటూ ముందుకు వెళుతున్నప్పుడు వాటిని తప్పించుకోవడానికి, అధిగమించడానికి అనేక దొడ్డిదారులు ఉంటాయి. ప్రజలు కూడా మనకు అనేక సలహాలు కూడా ఇస్తారు. మీరు ఈ శ్రమల గుండా ఎందుకు వెళుతున్నారు దానికి ఈ మార్గం గుండా వెళ్ళవచ్చని, విలువలతో కొంచెం రాజీపడితే సరిపోతుందని, ఎందుకు నీ జీవితాన్ని కష్టాలపాలు చేసుకొంటావు? అని అంటారు. ఇలాంటి సందర్భాల్లో దేవుని మార్గంలో వెళ్ళాలా, సులభమైన మార్గంలో వెళ్ళాలా అనే రెండు దారులు మనముందుండి నిర్ణయించుకోవడం కష్టంగా ఉంటుంది. మనం ఏ వైపు ఉంటామా అని దేవుడు చూస్తుంటాడు. ఇలాంటి క్లిష్టమైన సమస్యల్లో వెళ్తున్నప్పుడు మనం దేవునికి విధేయత చూపించాలని దేవుడు కోరుకొంటున్నాడు. ఆ సందర్భాల్లో, ఏది ఏమైనా సరే నేను దేవునితోనే ఉంటాను, దేవుడు నన్ను సంపూర్ణంగా తయారు చేస్తున్నప్పుడు ఆయనకు విధేయత చూపిస్తానని చెప్పాలి. ఈ సందర్భంలో చాలామంది విశ్వాసులు ఫెయిల్ అయిపోతున్నారు. విధేయత చూపించడం

వెలతో కూడుకొన్న విషయం. దేవుడు అలాంటి వ్యక్తుల కోసం చూస్తున్నాడు. వెల చెల్లించడానికి ఇష్టంగా ఉన్నామా? విధేయత పరిపక్వతను, పరిపూర్ణతను తీసుకువస్తుంది. అలాంటి పరిస్థితుల గుండా వెళ్తున్నప్పుడు దేవుని సారూప్యతలోనికి ఎదుగుతాము.

## పరిపక్వత నుంచి క్రైస్తవ ప్రయాణం రెండు విధాలు

1. మనం సంపూర్ణతలోకి ఎదుగుతూ పరిపక్వత సాధిస్తూ ఉన్నప్పుడు దేవుడు మన ప్రభావాన్ని విస్తరిస్తాడు. అప్పుడే నిజమైన పరిచర్య మన ద్వారా జరుగుతుంది. అలాంటి పరిచర్య దేవునిని సంతోషపరుస్తుంది.

2. అంతమాత్రమే కాదుగానీ దేవుని యొక్క విస్తృతమైన కథ/ప్రణాళికలో మనం కూడా పాలిభాగస్తులం అవుతాము. అబ్రహాము జీవితం దీనికి మంచి ఉదాహరణ. ఆది 22:18లో దేవుడు అబ్రహాముతో నీవు నా మాటకు విధేయత చూపించావు కాబట్టి నీ ద్వారా సమస్త వంశాలన్ని ఆశీర్వదించబడతాయని చెబుతాడు.

ఇబ్బందులు, శ్రమల గుండా వెళ్తున్నప్పుడు దేవుడు ఆయన సంపూర్ణమైన ప్రణాళికను నిర్మించడానికి వాటిని వాడుతున్నాడు. ఒకరోజు మనం దేవునిముందు నిలబడినప్పుడు ఈ మొత్తం ప్రణాళికను మనముందు విప్పి చూపించినప్పుడు అది మొత్తంగా మనకు అర్థమవుతుంది. అప్పుడు ఎక్కడెక్కడ మనం సంపూర్ణత కొరకైన పరీక్షల్లో విజయం సాధించామో, విఫలమయ్యామో తెలుస్తుంది. మనం సంపూర్ణత కొరకైన పరీక్షల్లో విజయం సాధించాం కాబట్టి నీ ప్రణాళికలో ఇవి జరిగాయని చెబుతాడు. వీటితో పాటే వీటిల్లో నీవు విఫలమయ్యావని, అవిధేయత చూపించావని, నీవు ప్రపంచం ఒత్తిడికి గురయ్యావు, లోకం మాట విన్నావు, నాకు అవిధేయత చూపావు, అందువల్ల పరలోక రాజ్యంలోకి రాకుండా నీవు ఎంతమందికి అడ్డుగా ఉన్నావో చూడు అని చూపిస్తాడు. అప్పుడు మనం వణుకుతాము, అయ్యో దేవా నాకీ సంగతి అప్పుడూ తెలియదే అని అంటాము.

ఆ సమయంలో, ఎందుకీ సమస్యలు, శ్రమలు, దేవా వాటిని నుంచి నన్ను తొలగించు అని అడిగానే గానీ మీ గొప్ప ప్రణాళికను అర్థం చేసుకోలేకపోయాను అని చెబుతాము. ఆ రోజు దేవుని దగ్గర మనం సాకులు చెప్పకూడదనుకొంటే ఈ రోజు మనం నిర్ణయం చేయాలి. ప్రతి సంపూర్ణత కొరకైన పరీక్ష మనల్ని నిర్మించడానికేనని. దేవా నీకు విధేయత చూపిస్తాను, ఒకవేళ ఎంత వెల చెల్లించాల్సి వచ్చినా సరే, దేవా నిన్నే నమ్ముతాను అని చెబుదాం.

## అవసరాల కోసం కాదు, దేవుని మాటకోసం జీవించాలి

దేవుడు మనల్ని ఇలాంటి పరిస్థితుల గుండా తీసుకెళుతున్నప్పుడు ప్రతి సందర్భంలో పాఠాలు నేర్పిస్తుంటాడు. ద్వితీ 8:2,3 చదువుదాం. ఇశ్రాయేలీయుల్ని దేవుడు అరణ్యమార్గం గుండా నడిపిస్తున్నప్పుడు అనేక రకాలైన కఠిన అనుభవాలగుండా వెళ్ళారు. ఆహారం విషయంలో వారు సణిగారు, ఫిర్యాదులు చేశారు, మోషే మీద తిరగబడ్డారు. తర్వాత దేవుడు వారిని మన్నాతో పోషించాడు. దేవుడు ఇలా ఎందుకు చేశాడంటే “మనుష్యుడు రొట్టెవలన మాత్రమే కాదుగానీ దేవుని నోట నుంచి వచ్చే ప్రతిమాట వలన బతుకుతాడు” అనే పాఠాన్ని వారికి నేర్పించడానికి. ఈ శోధనే 40 రోజులు ఉపవాసమున్న సమయంలో యేసుక్రీస్తు ప్రభువు కూడా ఎదుర్కొన్నారు. ఆకలి ఒక అవసరం. అవసరాన్ని తీర్చుకోవడం తప్పేమీలేదు. మనలో ప్రతి ఒక్కరికీ అవసరాలు ఉన్నాయి. వాటిని తీర్చుకోవడంలో తప్పేమిలేదుకదా అని మనం కూడా అంటాము. సాతాను కూడా ఇదే యేసు ప్రభువుతో చెబితే మత్తయి 4:4లో యేసుప్రభువు ద్వితీ 8:3లో చెప్పిన అద్భుతమైన మాటను చెబుతాడు.

ఆ విషయాన్నే దేవుడు ఇశ్రాయేలీయులకు నేర్పించడానికి 40సం॥ ప్రయత్నించాడు. కానీ వాళ్ళేమాత్రం నేర్చుకోలేదు. 1 కొరింథీ 10:11లో ఆ సంగతులన్ని యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై రాయబడ్డాయి. ఇశ్రాయేలీయుల జీవితంలో జరిగిన సంగతులు సండేస్కూల్లో పిల్లలకు కథలుగా నేర్పించడం కోసం కాదు. మనం పాఠాలు నేర్చుకోవడం కోసం. ఇశ్రాయేలీయులు ఏవిధంగానైతే కఠినమైన హృదయాలు కలిగి మెడవంచని జనంగా ఉన్నారో మనం కూడా అలానే ఉన్నాము. మనుష్యుడు రొట్టెవలన కాదుగానీ దేవుని నోట నుంచి వచ్చే

ప్రతిమాట వలన బతుకును అనే సంగతిని మనము గుర్తుపెట్టుకోవాలి. దేవుడు మనల్ని రొట్టె ఆధారిత జీవితం నుంచి, దేవుని మాట ఆధారిత జీవితంలోకి మారాలని కోరుకొంటున్నాడు.

మత్తయి 6:31–33లో....మనం ఏమి తినాలి? ఏమి తాగాలి? ఏమి ధరించుకోవాలన్నది అవసరాలకు సంబంధించినవి. ప్రపంచం ఈ అవసరాల్ని పొందుకోవడం కోసం వాటి వెంట పరుగెత్తుతుంది. మనం ఇప్పుడు లోకం నుంచి బయటకు వచ్చాము. ఇప్పుడు మనం ఏమి చెప్పాలంటే నేను వీటికోసం బతకను, ఎందుకంటే, మన పరలోకపు తండ్రికి మన అవసరాలు తెలుసు అని చెప్పాలి. నేనెందుకు వాటి గురించి చింతించాలి? అవసరాల ఆధారంగా మనం జీవిస్తే జీవితం సులభంగా ఉంటుంది. దేవుని వాక్యం ఆధారంగా జీవిస్తే జీవితం ఒక సవాలుగా ఉంటుంది. అక్కడే ఎదగడం ఉంటుంది. మనం దేవునితో దేవా! ఇక నుంచి అవసరాల కోసం కాకుండా మీ మాట ప్రకారం జీవిస్తానని చెప్పాలి.

## వాక్యాధారమైన జీవితం జీవించడానికి దేవుడు తన కృపను ఇస్తాడు

మన శక్తి, బలం చేత గొప్ప నిర్ణయాలు చేయడం మనకు సాధ్యం కాదు. ఇక్కడ గొప్ప నిర్ణయాలు చేసినా బయటికెళ్ళిన తర్వాత అలా జీవించడం సాధ్యం కాదు. ఇక్కడే దేవుని కృప మనతో ఉంటుంది. కృప అంటే ఏంటి? కృప అంటే దైవసంబంధమైన సహాయంగా చూడాలి.

ఒక చిన్న అబ్బాయి బైట ఆడుకొంటున్నాడు. ఒక అంకుల్ కారు స్టార్ట్ చేయబోతున్నాడు కానీ అవ్వడంలేదు. ఆయన ఆ అబ్బాయిని పిలిచి మీ నాన్నను పిలువు కారు నెట్టడంలో సహాయపడతాడు అని చెప్పాడు. అబ్బాయి తన తండ్రి దగ్గరకు వెళ్ళి అంకుల్ కారు స్టార్ట్ అవ్వడంలేదు. నెట్టడానికి సహాయం చేయమని అడుగుతున్నాడని చెప్పాడు. ఆయన వచ్చి కారు నెడుతుంటే, ఆ అబ్బాయి నేను కూడా నెడతాను అంటాడు. సరే అంటాడు తండ్రి. కారు ప్రారంభమైంది. ఆ అబ్బాయి వెంటనే ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి మమ్మీ, మమ్మీ..డాడీ, నేను కారు నెడితే కారు ప్రారంభమైంది అంటాడు. అప్పుడు మమ్మీ, అరే నీవల్ల కార్ స్టార్ట్ అయ్యిందనుకొంటున్నావా? కేవలం నీవు చేయి ఉంచావంతే అని అంటుంది. బలమంతా తండ్రిదే. జీవితాన్ని మన శక్తితో ప్రయత్నించవద్దు. చాలామంది స్వశక్తితో ప్రయత్నాలు చేసి నిరాశ, నిస్పృహకు లోనై ఓడిపోతుంటారు.

## చిన్న అమ్మాయి నయమాను ఇంటికి గొప్ప నిరీక్షణ ఇచ్చింది

2 రాజులు 5:వ అధ్యాయంలో చిన్న అమ్మాయి ని ఇశ్రాయేలు దేశం నుంచి సిరియా దేశానికి బంధీగా తీసుకొచ్చారు. ఆమె పేరు, వయసు గురించి లేదు. 10–12సం॥ వయస్సు అనుకోవచ్చు. కానీ ఆమె తెలివి కలిగినది. తన చుట్టూ ఉన్న పరిస్థితుల గూర్చి అవగాహన కలిగిన అమ్మాయి. తను ఉన్న పరిస్థితులను బట్టి బాధపడకుండా 2 రాజులు 5:3లో షోమ్రోనులో ఉన్న ప్రవక్త దగ్గర నా యేలినవాడు ఉండవలెనని నేను కోరుచున్నాను. అతడు నా యేలినవానికి కలిగిన కుష్ఠరోగమును బాగుచేయునని తన యజమానురాలితో చెప్పింది. ఈ అమ్మాయి శ్రమల్లో ఎదగడం అంటే ఏంటో మనకు చూపిస్తుంది. ఈ చిన్న అమ్మాయి నుండి పెద్దపాఠం నేర్చుకోవాలి. మనకు వచ్చే సమస్యలు మనల్ని నాశనం చేయడానికి కాదుగానీ శ్రమలు మనల్ని గొప్ప ఎదుగుదలలోకి నడిపిస్తాయి. ఆ అమ్మాయిని చూసినప్పుడు తన సమస్యల్లో నుంచి ఎంత అద్భుతంగా ఎదుగుతుందో చూస్తాం. ఇది దేవుడు పని చేస్తున్నాడనడానికి నిదర్శనం.

## ముగింపు

దేవుడు మనల్ని కష్టమైన పరిస్థితుల గుండా వెళ్తున్నప్పుడు మనల్ని పరిపూర్ణులుగా చేయాలనుకొంటున్నాడు. మనం దానికి విధేయత చూపిస్తే దేవుడు మన జీవితం ద్వారా గొప్పగా పని చేయడం ప్రారంభిస్తాడు. దేవా నా కష్టాల్ని ఉన్నది ఉన్నట్లుగా అంగీకరిస్తాను అని చెప్పాలి. దానిలో ఎదగడానికి ఇష్టపడినప్పుడు దేవుడు గొప్ప కార్యాలు చేస్తాడు. మనదేశంలో గొప్ప మార్పులు ఎందుకు రావడం లేదో తెలుసా? నీవు నేను మన ఇబ్బందుల్లో దేవుని పనిచేయడానికి ఒప్పుకోవడం లేదు. అలా మనల్ని మనం అప్పగించుకొన్నప్పుడు, తీర్మానం చేసుకొన్నప్పుడు ఉన్నతమైన మార్పులు తీసుకొస్తాడు.

**– వేలంటైన్ దేవిదార్,** చెన్నై

(సెంట్రల్ సర్కార్స్ రెగ్‌కాన్–2024 మూడవ డివోషన్)

బైబిల్ స్టడీ



# త్యాగపూరితంగా సేవ చేయడం

## ఫిలిప్పీ 2:25-30

"యేసుని పొలములో మనమందరము జతపనివారము, వేరు వేరు పనులను మనకు ప్రభువే ఇచ్చెనుగ". అవును దేవుడు మనలందరిని ఒకే పరిశుద్ధమైన, ఉన్నతమైన పిలుపుతో పిలిచినప్పటికీ వేరు వేరు పనులను, బాధ్యతలను మనకు అప్పగించాడన్నది వాస్తవం. పరిశుద్ధ గ్రంథంలోను, చరిత్రలోను ఎంతోమందికి దేవుడు అప్పగించిన పనిని, బాధ్యతలను ఎంతో యధార్థంగా, నమ్మకంగా పూర్తి చేసినట్లు చూస్తాం. ఇందుకోసం వారు ఎన్నో శ్రమలు, బాధలు, హింసలు, అనారోగ్యాలు.. చివరికి వారి ప్రాణాలను సహితం అర్పించినట్టుగా చూస్తాము. ఇందుకు యేసుక్రీస్తు ప్రభువు గొప్ప మాదిరి. తండ్రి ఆయనకు అప్పగించిన పనిలో ఎన్నో హింసలు, అవమానాలు పొందినప్పటికీ తండ్రి అప్పగించిన బాధ్యతను ఆయన సంపూర్ణంగా నెరవేర్చి దేవుని మహిమ పరిచినట్లుగా చూస్తాం. యుఇయస్ఐ పరిచర్యలో దేవుడు మనకు నశించిపోతున్న విద్యార్థులకు యేసుక్రీస్తు గురించిన సువార్త చెప్పి, వాళ్ళను శిష్యులుగా, నాయకులుగా తర్ఫీదు చేయడం అనే గొప్ప పనిని అప్పగించాడు. బైబిల్‌లో ఎపఫ్రొదితును గూర్చి ఎక్కువ వాక్యభాగాలు మనము చూడము, కానీ పౌలు ఆయన గురించి చెప్పిన మాటలు చూస్తే, ఎపఫ్రొదితు దేవుని సేవలో నా జతపనివాడును, నాతోటి యోధుడు అన్నమాటలు మనకు ఎంతో స్ఫూర్తినిస్తాయి.

### నేపథ్యం

ఎపఫ్రొదితు ఫిలిప్పీ నగర వాసి. యూదేతరులలో నుండి ప్రభువును నమ్ముకొన్నవాడు. ఎపఫ్రొదితు అంటే "ఆహ్లాదపరిచే, మైమరిపించే" అని అర్థం. ఎపఫ్రొదితు ఫిలిప్పీ సంఘానికి ప్రతినిధిగా ఉన్నాడు. ఫిలిప్పీ సంఘం పౌలుకు కొన్ని వస్తువులు, నగదు ఇతని ద్వారా పంపించింది. అతడు 700 కి.మీ. ప్రయాణం చేసి రోమ్‌కు వచ్చి పౌలుకు పరిచర్య చేశాడు. అయితే ఎపఫ్రొదితు పౌలు దగ్గర ఉన్నప్పుడు అతను రోగిగా ఉన్నట్టు, తీవ్రమైన అనారోగ్యానికి గురై మరణం దాకా వెళ్లినప్పుడు ప్రభువు అతనిని స్వస్థపరిచాడు. పౌలు ఈ వాక్యభాగంలో అతను ఇప్పుడు క్షేమంగా ఉన్నాడని, ఫిలిప్పీ సంఘం వారు పంపినవి అందాయని తెలుపుతూ ఎపఫ్రొదితు యొక్క పరిచర్య భారాన్ని వివరిస్తూ సంఘం అతనిని గౌరవించమని లేఖ రాసి ఎపఫ్రొదితుతో ఫిలిప్పీ సంఘానికి పంపిస్తాడు.

### ప్రశ్నలు

1. ఈ వాక్యభాగంలో పౌలు ఎవరి గురించి ప్రస్తావించారు? పౌలు అతనిని ఏ విధంగా సంభోదిస్తున్నాడు?
2. "జతపనివాడు, సైనికుడు," అనే పదాలు విశ్వాసి జీవితం గురించి ఏమి తెలియజేస్తాయి?
3. ఎపఫ్రొదితు పౌలుకి క్రీస్తు పనిలో ఎలాంటి జతపనివాడుగా ఉన్నాడు?
4. పౌలుకి ఎపఫ్రొదితుకి మధ్య ఉన్న సంబంధం ఎలాంటిది? ఒకరికి ఒకరు ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చుకొన్నారు(27,29)? ఎందుకు?
5. ఎపఫ్రొదితుని "మీ దూత" అని ఎందుకు పౌలు పిలుస్తున్నాడు?
6. ఎపఫ్రొదితు స్వస్థత పౌలును ఎలా ప్రభావితం చేసింది?
7. ఫిలిప్పీయులు ఎపఫ్రొదితును ఎందుకు ఉన్నతంగా పరిగణించాలని పౌలు కోరుతున్నాడు? కారణం ఏమై ఉండవచ్చు ?
8. సాధారణంగా క్రైస్తవ పనివారితో మనం ఎలా ప్రవర్తించాలనే దాని గురించి ఈ భాగం మనకు ఏమి చెప్తుంది?
9. మనం ఎపఫ్రొదితు లాగా క్రీస్తు పనిలో జతపనివానిగా, సైనికునిలా ఉండాలంటే మనకు ఉండాల్సిన లక్షణాలు ఏంటి? అలా ఉండక పోవడానికి కారణాలు ఏంటి?
10. పౌలు, ఎపఫ్రొదితు నుండి మనం నేర్చుకోవలసిన విషయాలు ఏంటి?

– **విజయశాంతి,** స్టాఫ్, కడప



# పశ్చాత్తాపం

సీమోను అనే ఒక పరిసయ్యుని ఆహ్వానం మేరకు ప్రభువైన యేసుక్రీస్తు అతని ఇంటికి భోజనానికి వెళ్ళాడు. ఆ ఊరిలో ఉన్న పాపాత్మురాలైన ఒక స్త్రీ ఈ విషయం తెలుసుకొని, ఒక బుడ్డిలో అత్తరు తీసుకొని ఆ ఇంటిలోనికి వచ్చింది. వెనుకవైపు ఆయన పాదముల వద్ద నిలబడి, తన కన్నీళ్ళతో ఆయన పాదములు తడిపి, తన తల వెంట్రుకలతో ఆయన పాదములు తుడిచి, ఆయన పాదములను ముద్దుపెట్టుకొని, తన వద్దనున్న అత్తరును ఆయన పాదములకు పూసింది (లూకా 7:36-38). ఆమె తన పాపముల విషయమై ఎంతో వేదన చెందింది.

పాపియైన ఒక వ్యక్తి హృదయంలో తన పాపం పట్ల కలిగే పశ్చాత్తాపానికి, ప్రభువునందు ఉంచే విశ్వాసానికి, తద్వారా లభించే పాప క్షమాపణకు పైన చెప్పిన సంఘటన ఒక చక్కని ఉదాహరణ. ఇలా వ్యక్తి అంతరంగంలో జరిగే ఒక క్రియను పశ్చాత్తాపం అంటారు. పశ్చాత్తాపం గూర్చి మరికొంత వివరణను మనం ఈ వ్యాసంలో చూద్దాం.

## పశ్చాత్తాపం - అర్థం

పాత నిబంధనలో పశ్చాత్తాపం అని అర్థమిచ్చే "నహమ్" అనే హెబ్రీ పదాన్ని ఉపయోగించడం జరిగింది (యోబు 42:6; యిర్మీయా 8:6). నహమ్ అంటే తన చెడుతనము, పాపము గూర్చి దు:ఖించడం, ఏడ్వడం. పాత నిబంధనలో 'షబ్' అనే మరొక పదాన్ని కూడా ఉపయోగించడం జరిగింది (2 దిన 7:14). షబ్ అంటే చెడు మార్గములను విడిచిపెట్టడం. పాపం నుండి దేవునివైపుకు తిరగడం. క్రొత్త నిబంధనలో పై రెండు అర్థాలను ఇచ్చే "మెటనోయ", "మెటనోయి" అను గ్రీకు పదాలను రాయడం జరిగింది. మెటనోయాను 24 సార్లు రాశారు (ఉదా: మత్తయి 4:7; అ.కా. 3:19). దీని అర్థం "మనసును మార్చుకొనుట". "మెటనోయి" అనే పదాన్ని క్రొత్త నిబంధనలో 34 సార్లు ఉపయోగించడం జరిగింది (ఉదా: లూకా 15:7; 1 థెస్స 1:9). దీని అర్థం పాపము నుండి దేవునివైపు తిరుగుట. కాబట్టి, పశ్చాత్తాపం అంటే, ఒక వ్యక్తి తన పాపమును బట్టి దు:ఖించి, తన పాపస్థితిని విడిచి, ప్రభువైన యేసుక్రీస్తు వైపుకు తిరిగి, ఆయనను విశ్వసించడం. తెలుగు క్రొత్త నిబంధనలో పశ్చాత్తాపం అనే పదాన్ని 'మారుమనసు' అని తర్జుమా చేయడం జరిగింది.

## పశ్చాత్తాపంలోని దశలు/ క్రియారూపక పశ్చాత్తాపం

- ❖ ఒక వ్యక్తి తన పాపమును గుర్తించడం.
- ❖ తన పాపమును గూర్చి దు:ఖించడం.
- ❖ తన పాపమును విడిచిపెట్టడం.
- ❖ పరిశుద్ధంగా జీవించాలని ఆశపడడం.
- ❖ పాపమును ద్వేషించడం.
- ❖ పరిశుద్ధతను వెంటాడడం.

## పశ్చాత్తాపం - అవసరత

దేవుడు లోకంలో ఉన్న ప్రతీ మనిషిని ఎంతో ప్రేమిస్తున్నాడు. నిత్యజీవాన్ని ఇవ్వడం కోసం తన కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపాడు. ఆయన మనుష్యులందరి కోసం, వారికి బదులుగా సిలువలో మరణించాడు. పాపం మూలంగా నశించి, నరకానికి వెళ్తున్న ప్రజలు తమ పాపముల విషయమై దు:ఖించి, వాటిని విడిచి ప్రభువైన యేసుక్రీస్తును విశ్వసించాలన్నది తండ్రియైన దేవుని కోరిక. మనుష్యులు తమ పాపముల నుండి విమోచన, విడుదల పొందడానికి, పాపక్షమాపణ పొందడానికి దేవుడు ఏర్పాటు చేసిన ఏకైక మార్గం ఇది. దేవుని ఆజ్ఞ కూడా (అ.కా. 17:30). మానవుల పాప

విమోచన, క్షమాపణకు మూలం ప్రభువైన యేసుక్రీస్తు సిలువ మరణం, ఆయన పునరుత్థానాలే.

అలాగే ఒక విశ్వాసి ఆధ్యాత్మిక ఎదుగుదలను తన బలహీనతలు, తన పాపం అడ్డుకొంటాయి. అతణ్ణి రక్షణ ఆనందాన్ని అనుభవించకుండా చేస్తాయి. గనుక, అతను తన తప్పును వెంటనే గ్రహించి, దేవుని క్షమాపణ కోరి, వాటిని విడిచిపెట్టడం మూలంగా, అతను పరలోక ఆనందాన్ని అనుభవిస్తాడు. ఆత్మీయ జీవితంలో ఎదుగుతాడు. దేవునికి మహిమను తీసుకొస్తాడు.

## పశ్చాత్తాపం - విశ్వాసం

పశ్చాత్తాపం, విశ్వాసం రెండూ విడదీయలేనివి. పాపాత్మురాలైన స్త్రీ తన పాపముల విషయమై దు:ఖించింది. అయితే, చివర్లో "నీ విశ్వాసము నిన్ను రక్షించెను" అని ప్రభువు ఆమెతో చెప్పారు (లూకా 7:50). అంటే, నిజమైన పశ్చాత్తాపం, నిజమైన విశ్వాసం, రక్షణలోనికి నడిపిస్తాయి. అవి రెండు విడదీయరానివి. ఈ రెండింటి ఫలితంగా ఒక వ్యక్తి రక్షణ పొందుతాడు. అంటే పాప క్షమాపణ, పాప విమోచన, నిత్యజీవం, మొ॥న పరలోక ఆశీర్వాదాలు పొందుతాడు.

## పశ్చాత్తాపం - పరిశుద్ధాత్మ దేవుడు

"ఆయన వచ్చి పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును" (యోహాను 16:8). అంటే ఒక అవిశ్వాసిలో పరిశుద్ధాత్మ దేవుడు పశ్చాత్తాపాన్ని కలుగజేస్తాడని ఈ వచన భావం. ఇది దేవుని కార్యం. పశ్చాత్తాపంలో భాగంగా ఒక అవిశ్వాసిలో కలిగే మార్పులను మనం తెలుసుకొందాం.

### 1. పాపి మనసులో మార్పు

మనసు అంటే తెలివి, బుద్ధి, వివేకం, మేధస్సు, గ్రహణ శక్తి. సాతాను వీటి శక్తి సామర్థ్యాలను అణచివేసి, తన ఆధీనంలో ఉంచుకొన్నాడు. ఫలితంగా, మానవుడు పాపానికి, లోకానికి, సాతానుకు బానిసయ్యాడు. దేవునిపై తిరుగుబాటు చేసి ఆయనకు శత్రువయ్యాడు. మానవునిలోని ఈ అంతరంగిక సామర్థ్యాలను సువార్త సత్యాల ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు వెలిగిస్తాడు. ఫలితంగా దేవుని పరిశుద్ధతను (యెషయా 6:1-5), దేవునికి వ్యతిరేకంగా తాను చేసిన తిరుగుబాటును, పాపాలను (కీర్తన 5:3-4; రోమా 1:32), తన అపరాధం, అపవిత్రతలను (లూకా 15:18), దేవుని యెదుట తన నిస్సహాయతను దేవుని ప్రేమ, కృపలను అర్థం చేసుకోవడం ప్రారంభిస్తాడు.

### 2. పాపి భావోద్రేకాలలో మార్పు

దేవుని దృష్టిలో పాపం ఎంత హీనమైనదో, ఘోరమైనదో గ్రహించడం. పాపం పట్ల తనకున్న ఇష్టాన్ని, అయిష్టత, ద్వేషంగాను, దేవుని పట్ల తనకు ఉన్న విరోధభావాన్ని ప్రేమ, గౌరవం, ఆరాధన భావంగాను మారునట్లు పరిశుద్ధాత్మ దేవుడు ఒక అవిశ్వాసిలో కార్యం చేస్తాడు. తాను ఎంత ఘోర పాపినో అని గుర్తించినప్పుడు, తన పాపం పట్ల దు:ఖించడం మాత్రమే కాదు, దానిని విడిచి, దేవునివైపు తిరగాలని, ఆయన కొరకు జీవించాలనే కోరిక అతనిలో కలుగుతుంది (కీర్తన 32:3-5; 119:29,37).

### 3. పాపి చిత్తములో మార్పు

ఒక అవిశ్వాసిలో పరిశుద్ధాత్మ దేవుని కార్యాలలో మరొక ప్రాముఖ్యమైన కార్యం అతని చిత్తములో మార్పును తీసుకు రావడం. ఒక వ్యక్తి చిత్తములో మార్పు కలగకపోతే, పశ్చాత్తాపం అసంపూర్ణంగా ఉంటుంది. ఆ వ్యక్తి చిత్తం, ఇష్టాలు, ప్రణాళికలు, లక్ష్యాలలో పరిశుద్ధాత్మ దేవుడు మార్పును ప్రారంభిస్తాడు. ఫలితంగా, ఒక విశ్వాసి అవన్నీ దేవుని ప్రణాళిక, దేవుని చిత్త ప్రకారం జీవించాలని కోరుకొంటాడు. ఆ ప్రకారం మార్పు చేసుకొంటాడు. దేవుని చిత్తానికి లోబడి జీవించడమే తన జీవిత లక్ష్యమని అతను భావిస్తాడు.

ఒక వ్యక్తిలో పరిశుద్ధాత్మ దేవుడు చేసే ఈ మూడు కార్యాల వలన ఆ వ్యక్తిలో తాను పాపిననే ఒప్పుదల, తన పాపం పట్ల దు:ఖం (మెటనోయా), పాపాన్ని విడిచిపెట్టి, దేవుని వైపు తిరగాలనే కోరిక, ఇష్టం (మెటనోయి) కలుగుతాయి. ఇవన్నీ ఒక్క క్షణంలో జరిగే కార్యాలు. ఇవన్నీ సువార్తకు స్పందించే ఒక పాపి హృదయంలో పరిశుద్ధాత్మ దేవుడు జరిగించే కార్యాలు. కాబట్టి పరిశుద్ధాత్మ దేవుని చొరవ లేకపోతే ఒక వ్యక్తిలో పశ్చాత్తాపం కలగడం అసాధ్యం.

## సువార్త - పశ్చాత్తాపం

సువార్త పశ్చాత్తాపానికి విత్తనము వంటిది.

ప్రార్థన నీరు వంటిది. పరిశుద్ధాత్మ దేవుడు సూర్య రశ్మి వంటి వారు. సువార్త యుఇయస్ఐకి పదును వంటిది. వ్యక్తిగత, సామూహిక ప్రార్థన, ఐక్యత, నశించు ఆత్మల పట్ల భారం లేకపోతే, పదును మొద్దుబారుతుంది. ఫలితంగా, ఎంత పరుగెత్తి పరిచర్య చేసినా, ప్రణాళికాబద్ధంగా చేసినా, అవిశ్వాస విద్యార్థులలో నిజమైన పశ్చాత్తాపం, రక్షణానుభవం చూడలేము. ప్రస్తుతం మన స్థానిక పరిచర్యలో ఇలాంటి పరిస్థితి ప్రతిబింబిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. మన సౌవార్తిక కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థులలో నిజమైన పశ్చాత్తాపం ఎందుకు రావడం లేదో పరీక్షించుకొందాం. ప్రార్థించి సమాలోచన చేసి పరిష్కార మార్గాలను ప్రభువు నుండి పొందుకొందాం. పరిశుద్ధాత్మ దేవుని గొప్ప కార్యాలను మన పరిచర్యలో చూద్దాం.

## పశ్చాత్తాపం - దాని ఫలాలు

"మారుమనస్సుకు తగిన ఫలములు ఫలించుడి" (లూకా 3:8) అని దేవుడు తన వాక్యం ద్వారా మనల్ని, అంటే ఒకప్పుడు మన పాపం విషయమై దు:ఖించి, ప్రభువును విశ్వసించి, ఆయన బిడ్డలమైన మనల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. రక్షణ పొందే సమయంలో మన మనసులో, భావోద్రేకాలలో, చిత్తంలో పరిశుద్ధాత్మ దేవుడు జరిగించే కార్యాలు, మార్పులు ప్రారంభాలు మాత్రమే. దేవుని వాక్యానికి ప్రతిదినం విధేయత చూపుతూ, ఆ ప్రారంభ కార్యాలను మనలో కొనసాగించే పరిశుద్ధాత్మ దేవునికి, దేవుని వాక్యానికి లోబడుతూ జీవించాలి. అప్పుడు ఆయన మనలను పరిపూర్ణతలోనికి క్రమంగా నడిపిస్తూ ఉంటారు. మన విధేయత, మనలో ఆయన కార్యాలకు గుర్తుగా ఆత్మ ఫలం కనిపిస్తుంది. అప్పుడు లోకం క్రీస్తు ప్రభువును మనలో చూచి, ఆయనవైపు తిరుగుతుంది.

కానీ విచారకరమైన విషయం ఏంటంటే, ఆత్మఫలానికి బదులు మనం కారు ద్రాక్షలను కాస్తున్నాము. శరీర కార్యాలు, లోకసంబంధమైన విషయాలు మన మనసులను, భావోద్రేకాలను, మన చిత్తాలను పెనవేసుకొంటున్నాయి. ఫలితంగా, వ్యక్తిగత ఆధ్యాత్మిక జీవితంలో లేఖనాలకు అనుగుణమైన పరిపక్వత ఉండడం లేదు. కుటుంబం, సహవాసాలలో ప్రేమ, ఆప్యాయత, ఐక్యతలు లోపిస్తున్నాయి. మనస్పర్థలు, అనైక్యత, గ్రూపిజం, పక్షపాతం, కక్ష, వివక్ష, స్వార్థం, అసహనం, అపనమ్మకం, అయిష్టత, క్షమించలేనితత్వం, అహం, మొ॥ లోకానుసారమైన లక్షణాలు కుప్పలు తెప్పలుగా పొడ చూపుతున్నాయి. పైకి ఆధ్యాత్మికత, లోపల వివక్షత, అహం, స్వార్థం, నాయకత్వ దాహాలతో నయా వేషధారులుగా జీవిస్తున్నాం. సమయం మించిపోలేదు. ఈ క్షణమే దేవునివైపు తిరుగుదాం (2 దిన 7:14). మారుమనసుకు తగిన ఫలాలు గొప్పగా ఫలిద్దాం.

## పశ్చాత్తాపం - మానవుని స్వేచ్ఛ

మానవుని స్వేచ్ఛకు వ్యతిరేకంగా దేవుడు ఏమి చేయడు. ఎవ్వరినీ బలవంతంగా పశ్చాత్తాపంలోనికి దేవుడు నడిపించడు. అయితే తన పాపస్థితిని, తన నిస్సహాయ స్థితిని, పాపం మూలంగా తాను పొందబోయే నరకపు శిక్షను ఒక అవిశ్వాసి గుర్తించేలా పరిశుద్ధాత్మ దేవుడు అతనికి సహాయపడతాడు. ఒక విశ్వాసి జీవితంలో కూడా ఇదే జరుగుతుంది. అతను దేవుని వాక్యానికి భిన్నంగా జీవిస్తుంటే, తన వాక్యం, తన బిడ్డల సహవాసం ద్వారా ఆ వ్యక్తి తన తప్పును గుర్తెరిగి, దాని విషయమై దు:ఖించేలా, దేవునివైపుకు తిరిగి ఆయనకు లోబడేలా ఆయన సహాయపడతారు. ఆయన కార్యానికి లోబడని, ఒక అవిశ్వాసి నరకానికి పాత్రుడౌతాడు. తన పాప స్థితిని గుర్తించకుండా, పాపములో కొనసాగే విశ్వాసి ఫలము లేని చెట్టులా తయారై కుటుంబానికి, సహవాసానికి, పరిచర్యకు గొప్ప భారంగాను, అడ్డబండగాను మారతాడు.

## ముగింపు

లోకానికి ఆయన బిడ్డలమైన మనకు దేవుడు ఇస్తున్న పిలుపు పశ్చాత్తాపం అని విశ్వాసులమైన మనం పరీక్షించుకొందాం. మన సువార్తలో పదును ఉందా, లేక మన నిస్సారమైన జీవితాల ద్వారా అది మొద్దుబారిందా అని పరీక్షించుకొందాం. మన ఆలోచనలు, ప్రవర్తన మనకు, మన కుటుంబానికి, మన సహవాసానికి, పరిచర్యకు ఆశీర్వాదకరంగా ఉన్నాయా లేక అడ్డుబండలుగా ఉన్నాయా అని పరీక్షించుకొందాం. తప్పులు ఒప్పుకొందాం (2 దిన 7:14; యాకోబు 4:8-10; 5:16). లోకానికి ఉప్పుగాను, వెలుగుగాను జీవిద్దాం.

**- పి. రామస్వామి,** దర్శి

# హేబెలు

## నీతిమంతుని సాక్ష్యం ఎప్పటికీ సజీవం, సందేశాత్మకం


భూమి మీద కోట్ల వ్యక్తులు పుడుతుంటారు, మరణిస్తుంటారు. కొద్దిమంది జీవితాలు మాత్రం బతికున్నా, చనిపోయినా ఎప్పటికీ మాట్లాడుతూనే ఉంటాయి. అలాంటి సజీవ సాక్ష్యాలకు ఆద్యుడు హేబెలు. హేబెలు గురించి పరిశుద్ధ గ్రంథంలో ప్రస్తావించబడిన ప్రతిచోట ఎంతో విశిష్టత కనిపిస్తుంది. (ఆది 4: 1-11, మత్తయి 23:25, లూకా 11:51, హెబ్రీ 11:4, హెబ్రీ 12:24, 1 యోహాను 3: 12).

హేబెలు అనే పేరుకు 'వ్యర్థం' అని అర్థం. తల్లిదండ్రులు ఆ పేరు ఎందుకు పెట్టారో తెలియదు కానీ హేబెలు జీవితంలో ఎన్నో ప్రత్యేకతలు కనిపిస్తాయి.

హేబెలు తన తల్లిదండ్రులు నేర్పిన విషయాలను శ్రద్ధగా నేర్చుకొన్నాడు. దేవుని స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని చాలా చక్కగా అర్థం చేసుకొన్నాడు. ఈ సంగతి తన అర్పణను ఎంపిక చేసిన విధానాన్ని బట్టి గ్రహించగలం (ఆది4:4). హేబెలు తన జీవితంలో అన్నిటి కంటే దేవునికి హెచ్చు స్థానం ఇవ్వడం వల్లే శ్రేష్టమైన అనేక విషయాల్లో ప్రథముడయ్యాడని చెప్పవచ్చు.

### హేబెలు ప్రత్యేకతలు-ప్రథమ స్థానం

1. అందుబాటులో ఉన్న వనరుల నుండి (వ్యక్తులు, పరిసరాలు, పరిస్థితులు) దేవుని మనసును గ్రహించి విధేయత చూపిన వారిలో ప్రథముడు.
2. హృదయాంతరంగంలో నుండి పెల్లుబికి వస్తున్న ఆరాధనను అర్పణగా (తన మందలో తొలిచూలు కొవ్విన వాటిని) సమర్పించిన వారిలో ప్రథముడు.
3. దేవుడు లక్ష్యపెట్టిన వారిలో ప్రథముడు. అతని మనస్తత్వం, వైఖరి దేవునికి ఇష్టమయ్యింది.



4. విశ్వాసం చూపిన వారిలో ప్రథముడు. (హెబ్రీ 11: 4).
5. విశ్వాసమును బట్టి శ్రేష్టమైన బలి అర్పించిన వారిలో ప్రథముడు ( హెబ్రీ 11: 4).
6. విశ్వాసమును బట్టి నీతిమంతుడని తీర్పు పొందిన వారిలో ప్రథముడు.
7. చనిపోయి కూడా విశ్వాసము ద్వారా మాట్లాడుతున్న వారిలో ప్రథముడు.
8. తన క్రియలు నీతి గలవైనందున ద్వేషింపబడి, చంపబడిన వారిలో ప్రథముడు. అనగా హతసాక్షుల్లో ప్రప్రథముడు (హెబ్రీ 12: 24, 1 యోహాను 3 :12).
9. స్వల్పకాలం మాత్రమే జీవించి, ఎక్కువ ప్రభావం చూపిన వారిలో ప్రథముడు.
10. వినూత్న వృత్తిని చేపట్టిన వారిలో ప్రథముడు. తన తండ్రి ఆదాము, అన్న కయీను ఇద్దరూ వ్యవసాయకులు. (ఆది 3:15; 4:2). కానీ మొట్టమొదటిసారి భిన్నమైన వృత్తిని (గొఱ్ఱెల కాపరి) చేపట్టాడు.
11. ప్రతికూల నేపథ్యం నుండి అత్యుత్తమ వైఖరిని అలవర్చుకొన్న వారిలో ప్రథముడు.
12. తల్లిదండ్రుల వైఫల్యాలు, లోపాల నుండి పాఠాలు నేర్చుకొని ఉన్నతమైన వ్యక్తిత్వం కనబరచిన వారిలో ప్రథముడు.

హేబెలు నీతిమంతుడని సాక్ష్యాత్తు మన ప్రభువే ప్రస్తావించారు, ప్రశంసించారు (మత్తయి 25:35, లూకా 11:51).

అయితే కయీను తడి గుడ్డతో గొంతులు కోసే రకం, అసూయాపరుడు, దుష్టుని సంబంధి (1 యోహాను 3: 12.). అతడు హేబెలుతో మాట్లాడాడు, పోట్లాడినట్లు లేదు, కానీ పొలంలో తన తమ్ముని మీద పడి ప్రాణం తీశాడు (ఆది 4:8).

సాధారణంగా మంచివారికి అందరూ మంచిగానే కనిపిస్తారు. అన్నయ్య కుట్రను, దుష్టత్వాన్ని గ్రహించలేనంత మెత్తని మనసు హేబెలుది. కనీసం స్వీయ రక్షణకైనా ప్రయత్నించాడో లేదో !??

సొంత అన్నయ్యే అసూయకు గురయ్యేంత మంచితనం, మృదుస్వభావం హేబెలుది.

హేబెలు చిందించిన నిర్దోష రక్తం – సర్వమానవాళి పాప పరిహారం నిమిత్తం, అమూల్యమును, నిర్దోషమును, నిష్కళంకమైన గొర్రెపిల్ల వంటి యేసుక్రీస్తు ప్రభువు యొక్క పరిశుద్ధ రక్తానికీ, బలియాగానికీ ముంగుర్తుగా ఉంది.

నీతిమంతుడైన హేబెలు రక్తం యొక్క స్వరానికి దేవుడు ఎంతో విలువ ఇచ్చాడు. హేబెలు కంటే మరి శ్రేష్టమైన, క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసు ప్రభువు వారి ప్రోక్షణ రక్తాన్ని ఆశ్రయించిన వారి విషయంలో మరింత నిశ్చయంగా తన కృపను ధారాళంగా అనుగ్రహిస్తారని ఈ ఉదంతం ద్వారా మనకు స్పష్టంగా తెలుస్తుంది.

**నేర్చుకోవలసిన పాఠాలు**

1. దేవుని మనసెరిగి ఇష్టంగా ఆయనను ఆరాధించడం, సేవించడం, సాక్షిగా జీవించడం.
2. దేవుని ఎదుట నిర్దోషత్వం (మన హృదయం మన మీద దోషారోపణ చేయని పరిశుద్ధత – 1 యోహాను 3:19-21) కలిగి ఉండడం.
3. దేవుని సర్వాధికారాన్ని, సార్వభౌమత్వాన్ని అర్థం చేసుకొని వినయ విధేయతలు చూపడం.
4. వ్యక్తిగత, కుటుంబ, ఉద్యోగ, సేవా జీవితాల్లో యధార్థత కలిగి ఉండడం.

నీతిమంతుని సాక్ష్యం ఎప్పటికీ సజీవం, సందేశాత్మకం.

– **డా. శ్రీవరం వెంకటరాజు,** బొమ్మూరు

# ఒప్పందం



క్యాంపస్ క్రూసేడ్ ఫర్ క్రైస్ట్ వ్యవస్థాపకుడు బిల్‌బ్రైట్ ఇరవైయవ శతాబ్దపు గొప్ప క్రైస్తవ నాయకుల్లో ఒకరు. ఆయన నాయకత్వంలో 'నాలుగు ఆధ్యాత్మిక సూత్రాలు' అనే కరపత్రం, 'యేసుక్రీస్తు జీవిత చరిత్ర' అనే చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 400 మిలియన్స్ ప్రజలు చదవడానికి, చూడడానికి క్రూసేడ్ స్టాఫ్ ఎంతో శ్రమించారు. వారిలో 150 మిలియన్స్ ప్రజలు దేవునిని అంగీకరించి ఆయనతో నిత్యత్వంలో గడపడానికి తీర్మానించుకొన్నారు. 191 దేశాల్లో, 26,000మంది పూర్తికాల సేవకుల్ని, 2,25,000 మంది శిక్షణ పొందిన వాలంటీర్లు గల ఈ పరిచర్యను గమనించిన రిక్ వారెన్ బిల్‌బ్రైట్‌ను "దేవుడు ఎందుకు ఇంతగా దీవించాడు?" అని ప్రశ్నిస్తే, దీనికి ఆయన సమాధానం –

**"నా యవ్వన జీవితంలో దేవునితో నేను ఓ ఒప్పందం ఇలా కుదుర్చుకున్నాను. 'ఈనాటి నుండి నేను క్రీస్తుకు బానిసను అని కాగితం మీద రాసి దాని కింద సంతకం చేశాను".**

నీవు ఎప్పుడైనా దేవునితో ఈ విధంగా ఒప్పందం చేశావా?

ఆయనకు ఇష్టమైనట్లు జీవించకుండా, పూర్తిగా ఆయనకు సమర్పించుకోకుండా ఇంకా అవిధేయతతోనే జీవిస్తున్నావా?



# సత్సంబంధాలు

"ఇతరులతో మన సంబంధాలు సరిగా లేనంత కాలం
దేవునితో మనకున్న సంబంధం ఎప్పటికీ సరైనది కాదు"
– అలిస్టర్ బెగ్

సంబంధాలు లేని ప్రపంచం గురించి మనం ఆలోచించలేము. మానవ సమాజంలో ఉనికిలో ఉన్న అనేక సంబంధాలలో వ్యక్తుల మధ్య సంబంధం ఒకటి. మానవులు సామాజిక జీవులు. మనం సామాజికంగా ఉన్నామని చెప్పినప్పుడు మనం సామాజిక నేపథ్యంలో జన్మించాము, సామాజిక వాతావరణంలో జీవించడానికి దేవుడు సృష్టించాడు. మనం ఒంటరి వారం, స్వతంత్ర వ్యక్తులం కాదు, ఒకరిమీద మరొకరు పరస్పరం ఆధారపడే వాళ్ళం. సత్సంబంధాలే సహజ సంపద.

### సత్సంబంధాలు గురించి ఎందుకు ఆలోచించాలి?

ప్రస్తుత కాలంలో ఉరుకు పరుగుల జీవితాలలో మనుషుల మధ్య సంబంధాలు తగ్గిపోతున్నాయి. మనుషులు ఆర్థికపరమైన అంశాలకు ఇచ్చినంత ప్రాధాన్యత, ఆత్మీయ విషయాలకు, మానవ సంబంధాలకు ఇవ్వడం లేదు. ఒకరితోనొకరు మాట్లాడడానికి అర్థవంతమైన సమయం దొరకడం లేదు. దేవునితో సమయం గడపడం కూడా చాలా కష్టమైపోతుంది. సమయం దొరికితే మొబైల్ తోనో, పరిచర్య అనో, టి.వి. ముందో, కంప్యూటర్ ముందో కూర్చుని కాలం వెళ్ళబుచ్చుతున్నారే తప్ప కలిసి కూర్చొని మాట్లాడుకోవడం లేదు. ఒక వేళ మాట్లాడినా పని ఒత్తిడి వల్ల, విసుగు వల్ల, చిరాగ్గా మాట్లాడడం వల్ల సమాజంలో, విశ్వాసుల మధ్య కూడా తీవ్రమైన మనస్పర్థలు, గొడవలు, కొట్టుకోవడాలు జరుగుతున్నాయి.

నేటి క్రైస్తవ సమాజంలో స్థానిక సంఘాలు, సంఘ అనుబంధ సంస్థలు, శాఖలు మొదలగు వాటిలో సత్సబంధాలు గూర్చి చాలా కఠినమైన సమస్యలు ఉన్నాయి. తోటి విశ్వాసులతో సత్సబంధాలు వారి ఆత్మీయ పరిపక్వతను, పరిశుద్ధ జీవితాన్ని తెలియజేస్తాయి. విశ్వాసులు వీటిపై దృష్టిపెట్టకుండా, సరిచేసుకోకుండా, బైబిల్ స్టడీస్ తీసుకోవడం, బోధించడం, సౌవార్తీకరణ, సంఘాలను కట్టడం, ఇతర పరిచర్యలు, సాంప్రదాయ క్రైస్తవ కార్యక్రమాలపై దృష్టిపెడుతూ ప్రభువు పనిలో బిజీ అని చెబుతున్నారు. ప్రభువిచ్చిన విలువైన పరిచర్యను విలువలేని జీవితాలతో చేస్తూ, పరిచర్యకు నష్టాన్ని కలిగిస్తున్నారు. అందువల్ల క్రైస్తవ పరిచర్య సమాజంలో చూపించాల్సిన ప్రభావాన్ని చూపించలేకపోతుంది.

### సత్సంబంధాలు అంటే?

సాంఘిక మనస్తత్వశాస్త్రంలో, వ్యక్తుల మధ్య సంబంధం (Interpersonal Relationships) అంటే, "ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ వ్యక్తుల మధ్య ఉండే సామాజిక అను'బంధం', సాన్నిహిత్యం. ఇవి మంచిగా ఉంటే సత్సంబంధాలు కలిగి ఉన్నారని అంటాము.

పూలదండలో దారం పూలను ఎలా కలిపి ఉంచుతుందో అలాగే సమాజంలోని వివిధ ప్రజలను, వారి మధ్య సత్సంబంధాలను మానవత్వం, కులం, మతం, ప్రాంతీయం, భాష, విద్య, డబ్బు, ఇంటి పేరు...మొదలైనవి కలిపి ఉంచుతాయి. అయితే, విశ్వాసులంగా మనల్ని మానవత్వంతో

పాటు కలిపి ఉంచే బంధం 'క్రీస్తు రక్త సంబంధం'. క్రీస్తుతో కలిగిన ఈ సంబంధం, సాన్నిహిత్యం, కుల మత, ప్రాంతీయ బంధాలకు అతీతంగా మన అన్ని సంబంధాలను ప్రభావితం చేయాలి.

## సత్సంబంధాల ప్రాముఖ్యత

"దేవునికి సంబంధాలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే, మానవజాతితో సంబంధాన్ని కలిగి ఉండడానికి దేవుడు తన కుమారుడైన యేసును ఈ భూమికి పంపేటంత" అని అంటాడు బిల్లీగ్రేహం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాథమికంగా బైబిల్ మొత్తం సంబంధాల గురించే.

'క్రీస్తుతో సంబంధం, సాన్నిహిత్యం' కలిగిన వ్యక్తులు ఉన్నప్పుడు - మానసికంగా, భావోద్రేకపరంగా, శారీరకంగా ఆరోగ్యకరమైన వ్యక్తులు సమాజంలో, సంఘంలో, సంస్థల్లో ఎక్కువగా ఉంటారు. వ్యక్తుల మధ్య సంబంధాలు మంచిగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యకరమైన సమాజాన్ని, సంఘాల్ని, సంస్థల్ని కలిగి ఉంటాము. యుఇయస్ఐ సభ్యులముగా, సంఘాన్ని, సమాజాన్ని ప్రభావితం చేయాలన్నా, దేవునికి, దేశానికి మహిమ తేవాలన్నా మన సంబంధాలు దేవుడు ఆశించినట్లుగా ఆరోగ్యకరంగా ఉండాల్సిందే.

## సత్సంబంధాలు - బైబిల్ ఆధారం

త్రిత్వంలో తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు కలిగి ఉన్న సంబంధాలు తాత్కాలికమైనవి కాదు, శాశ్వతమైనవి, పరిశుద్ధమైనవి. ఆదిలో దేవుడు మానవులను తన పోలికలో సృష్టించి వారితో చక్కని సంబంధం కలిగి ఉన్నాడు. అయితే మానవుడు పాపం చేయడం ద్వారా దేవునికి, మానవులకు మధ్య సంబంధం దెబ్బతింది. దీనిని పునరుద్ధరించడానికి ఆయన తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపాడు.

యేసు క్రీస్తు ప్రభువు మానవునిగా ఈ లోకంలో ఉన్నప్పుడు, తన తల్లిదండ్రులను గౌరవించాడు, వారికి విధేయత చూపించాడు, శిష్యులను ప్రేమించాడు, వారి బలహీనతలను అర్థం చేసుకొని వారిని అంగీకరించాడు, స్త్రీలతో గౌరవంగా ప్రవర్తించాడు, మృదువుగా మాట్లాడాడు, ప్రత్యర్థులను దృఢంగా, న్యాయంగా ఎదుర్కొన్నాడు, అవమానాల్ని భరించాడు, తనను హింసించే వారిని క్షమించాడు, సమాజం వెలివేసిన వారిని పట్టించుకొన్నాడు. గనుక మన సంబంధాలకు ఆయనే మాదిరి. మన సహవాసంలో ఇలాంటి సంబంధాలను కొనసాగించాలంటే క్రీస్తు వైపు చూడాలి, బైబిల్ నుండి సూత్రాలను నేర్చుకోవాలి.

"మనము క్రీస్తును అంగీకరించినప్పుడు మూడు కొత్త సంబంధాలలోకి ప్రవేశిస్తాము: 1. దేవునితో- న్యాయమూర్తియైన దేవుడు తండ్రి అయ్యాడు, దూరం దగ్గర అయ్యింది, భయం ప్రేమగా మారుతుంది. 2. తోటి వ్యక్తులతో - ద్వేషం ప్రేమగా మారుతుంది, స్వార్థం సేవ అవుతుంది, అపకారం ఉపకారం, క్షమాపణ అవుతుంది. 3. మనం మనతో - మన బలహీనత బలం అవుతుంది, నిరాశ నిరీక్షణ అవుతుంది, ఉద్రిక్తత సమాధానం అవుతుంది" అని అంటాడు విలియం బార్క్లే.

మన సత్సంబంధాలకు ప్రధాన ఆధారం మన దేవుడే. లూకా 10 అధ్యాయాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. అన్ని సంబంధాలకు మూలమైనది దేవునితో సరైన సంబంధం కలిగి ఉండడమే (1యోహాను 1:3). దేవునితో సరైన సంబంధం లేకుండా మానవులతో సరైన సంబంధం కలిగి ఉండడం అసాధ్యం. దేవుడు రెండు ప్రధానమైన ఆజ్ఞలను ఇచ్చాడు. మొదటిది దేవుణ్ణి ప్రేమించడం, రెండవది పొరుగు వారిని ప్రేమించడం. వీటి కంటే ముఖ్యమైన ఆజ్ఞ మరేదీ లేదని ఆయనే చెప్పాడు. ఈ రెండింటిలో రెండు ప్రాథమికమైన సంబంధాలను చూస్తాం. మనం పరస్పరం ఒకరి పట్ల మరొకరు శ్రద్ధ వహించాలని, ఒకరికొకరు పరిచర్య చేసుకోవాలని, తత్ఫలితంగా క్రీస్తులో ఒకరినొకరు నిర్మించుకోవాలని దేవుడు ఆశిస్తున్నాడు. ఒకరినొకరు ప్రేమించుకోవాలనే ఆజ్ఞ ఆధారంగా (లూకా 10:27, యోహాను 13:34-35), వ్యక్తుల్ని సరిగ్గా అర్థం చేసుకోవడం చాలా ప్రాముఖ్యమైనది. వారిని సరిగ్గా అర్థం చేసుకొంటేనే మనం ప్రేమ చూపించగలం, సత్సంబంధాన్ని కలిగి ఉండగలం.

## సత్సంబంధాలు - ఆటంకాలు

దేవునితో సాన్నిహిత్యం లేకపోవడం, వ్యక్తులు దేవుని స్వరూపంలో ఉన్నారన్నది గుర్తించకపోవడం, వారిని ప్రేమించమన్న దేవుని ఆజ్ఞని పాటించకపోవడం. ప్రధానంగా మనమంతా ఒకే కుటుంబమని, ఒకే తండ్రికి పిల్లలమనే సత్యాన్ని గ్రహించకపోవడం.

వీటిలోనుండే మిగిలినవన్నీ వస్తాయి. అవి.. దేవునితో గడిపే సమయాన్ని నిర్లక్ష్యం చేయడం, సమర్పణ లేకపోవడం, పాపం, సాతాను ప్రమేయం, విలువలు లేకపోవడం, స్వార్థప్రియత్వం, క్షమించలేకపోవడం, వ్యక్తిని తక్కువ అంచనా వేయడం, నేనే కరెక్ట్ అనుకోవడం, అగౌరవం, కించపరచడం, సుదీర్ఘ విమర్శలు, గోప్యత, పారదర్శకత, సరైన కమ్యూనికేషన్ లేకపోవడం, గర్వం, ఈర్ష్య, గాసిప్స్, గ్యాస్ లైటర్స్‌లా ఉండడం, అజాగ్రత్త మాటలు, నిందించడం, దాడి చేయడం, మాట తప్పడం, విమర్శించడం, నిర్లక్ష్యంచేయడం మొదలగునవి.

ఒక తత్వవేత్త ఇలా అంటాడు "సత్సంబంధాలు ఎప్పుడూ సహజ మరణాన్ని పొందవు. అవి ఎప్పుడూ అహం, వైఖరి, ప్రవర్తన, వ్యక్తిగత ప్రయోజనాలు, అజ్ఞానంతో చంపబడతాయి".

## సత్సంబంధాలు - ఆచరణాత్మక సూత్రాలు

జీవితంలోని చాలా వైఫల్యాలు, వ్యక్తుల మధ్య సంబంధాల వైఫల్యాల ఫలితమే. కాబట్టి వ్యక్తులతో అర్థవంతమైన సంబంధాల్ని కొనసాగించడం మన విజయవంతమైన జీవితానికి కీలకం. మనుషుల మధ్యనున్న సంబంధాలు వారి వ్యవహారాలను బట్టి మారుతూ ఉంటాయి. ఇప్పుడు మిత్రుడుగా ఉన్న వ్యక్తి మరికొంత కాలానికి శత్రువుగా మారవచ్చు; అభిమానించిన వారే ద్వేషించవచ్చు. దీనికి కారణం వారి మధ్య ఏర్పడిన సంబంధాలను వారు నిలబెట్టుకోలేక పోవడమే. మన మధ్య ఏర్పడిన సంబంధాలు కుటుంబాలలో, సంఘాలలో, మన పరిచర్యలో కలకాలం నిలిచి ఉండాలంటే మనం ఈ కింది విషయాలను తప్పక కలిగి ఉండాలి.

1. **సమర్పణ** - సమర్పణ లేకుండా ఒకరు సమర్థవంతమైన సంబంధాన్ని కలిగి ఉండలేరు.
2. **ప్రేమ** - ప్రేమ పరస్పర సంబంధాలను ఉన్నతంగా చేస్తుంది.
3. **నమ్మకం** - నమ్మకం లేకుండా ఆరోగ్యకరమైన సంబంధాలు ఉండవు.
4. **పారదర్శకత** - వ్యక్తుల మధ్యలో పారదర్శకత ఉన్నప్పుడు సంబంధంలో భయం స్థానంలో భద్రత, సుముఖత ఉంటాయి.



5. **కమ్యూనికేషన్** - మానవ సంబంధాలలో సమర్థవంతమైన కమ్యూనికేషన్ అవసరం.
6. **వినడం** - మంచి అవగాహన కోసం అన్ని మానవ సంబంధాలలో సానుభూతితో వినడం అవసరం.
7. **ఎరగడం** - ఇతరులను గురించి సరైన అవగాహన కలిగివుండడం (ఇతరులను మనకంటే ఘనులుగా ఎంచుకోవాలి).
8. **సహవాసం, సహానుభూతి** - ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడడానికి, వినడానికి, పంచుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ఇది చాలా అవసరం. అలాగే ఎవరికైనా బాధ కలిగినప్పుడు మనం వారి స్థానంలో ఉండి ఆలోచించి వారికి సహాయం చేయడం చాలా ముఖ్యం.
9. **పరస్పర గౌరవం** - మెరుగైన మానవ సంబంధాలను నిర్మించడంలో పరస్పర గౌరవం చాలా ముఖ్యమైన అంశం.
10. **మర్యాద** - మర్యాద సంబంధాల్ని మెరుగు పరుస్తుంది.
11. **స్వీయ చిత్రం** - మానవ సంబంధాలలో సమతుల్య స్వీయ చిత్రం చాలా ముఖ్యమైన అంశం.
12. **క్షమాపణ** - దేవుడు మనల్ని క్షమించినట్లుగా ఇతరులను క్షమించడం.
13. **తగ్గింపు, సాత్వికం** - ఈ రెండూ మన స్వభావంలో భాగం అవ్వాలి. సాత్వికులు భూలోకాన్ని స్వతంత్రించుకొంటారు.
14. **సర్దుబాటు** - మనుష్యుల అలవాట్లు, వారి

మనస్తత్వాలు, ప్రవర్తనలు, వైఖరులు ఒకే విధంగా ఉండవు గనుక సర్దుబాటు చేసుకోవాలి.

**15. భావోద్రేకాల నియంత్రణ –** మనలోని ఆవేశాన్ని, క్రోధాన్ని, ద్వేషాన్ని, అసూయను ప్రభువుకు అప్పజెప్పి ఆయన లక్షణాలైన సహనం, ఓర్పును అలవర్చుకోవాలి.

## సత్సంబంధాలు - ఆచరించాల్సిన ప్రాంతాలు

### పరివారం (కుటుంబం)

కుటుంబం దేవుడిచ్చిన ప్రత్యేకమైన వరం గనుక ఆయన ఆశించిన విధంగా మన మనస్తత్వాలను మలచుకొని, ఆయన మనసులో సంతోషం పుట్టించే విధంగా మనం మసలుకోవాలి.

ఒకసారి కొందరు అమెరికన్ ప్రొఫెసర్స్ కోల్‌కతాలో మదర్ థెరిస్సాను కలిసి "గుర్తుంచుకొనే మాట ఒకటి చెప్పండి" అని అడిగారు. "ఒకరికొకరు ఎదురుపడినప్పుడు నవ్వుతూ పలకరించుకోండి. కనీసం చిరునవ్వుతో చూసుకోండి. ఇందులో సాధ్యం కానిదేమీ లేదు. మొదట కుటుంబ సభ్యులను ప్రేమించండి, వారితో ఆప్యాయంగా మాట్లాడండి. బయట కూడా అదే అలవాటు అవుతుంది. అప్పుడు ప్రపంచమే ఒక కుటుంబం అవుతుంది" అని చెప్పారు మదర్.

### పరిచర్య (సేవ)

పరిచర్య ప్రభువిచ్చిన గొప్ప భాగ్యం గనుక ప్రతి దినం ఆయన నేర్పిస్తున్న విషయాలను (మౌన ధ్యానం, ప్రత్యేక అధ్యయనం, బైబిల్ స్టడీస్, క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లు మొ.) అవగాహన చేసుకొని అనుదిన జీవితంలో ఆచరించాలి. పరిచర్యలో వివిధ రకాల వ్యక్తులు ఉంటారు. వారిని ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా పట్టించుకోవాలో, వారికోసం ఎలా ప్రార్థించాలో, పురికొల్పాలో, సరిచేయాలో, క్షమించాలో, భరించాలో పత్రికల్లో చాలా చక్కగా చూస్తాం. వాటిని మనం అనుసరించాలి. మన ఓపెన్ హోమ్స్, ఇజియఫ్‌లు, యంపిసిలలో ఈ సంబంధాలు బలోపేతం అవ్వాలి. క్రీస్తు తన శిష్యులను, ప్రజలను చూసినట్లుగా, మనం కూడా తోటి విశ్వాసులను, అవిశ్వాసులను చూడాలి.

### పని (ఉద్యోగం)

దేవుడు మనల్ని ప్రేమించి, గౌరవప్రదంగా బతకడానికి మనకు ఉద్యోగ బాధ్యతలను అనుగ్రహించాడు. వీటి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలి. ఉద్యోగంలో నమ్మకంగా ఉండడం, న్యాయంగా ఉండడం, అనేది కొంత మందికి ఇష్టం ఉండదు. ఇతరుల అభిప్రాయాలతో, అవగాహనతో సంబంధం లేకుండా మనం బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. మనం పని చేసే ప్రదేశం ఒక ప్రేషిత ప్రదేశంగా ఉండాలి. దానిని ఆలా మలిచేలా అవకాశాలు సంపాదించాలి. మన న్యాయవంతమైన, యథార్థమైన జీవితాన్ని చూసి కొందరు మనపట్ల మంచి అభిప్రాయంతో స్నేహంగా ఉంటారు. ఇలాంటి వారితో సత్ సంబంధాలు కొనసాగించడం సులువే. కానీ ఎవరైతే మనపట్ల వ్యతిరేక భావంతో ఉంటారో వారితో సంబంధాల్ని మంచిగా కొనసాగించడం సవాలే. వారికోసం క్రమంగా ప్రార్థించడం ద్వారా, సానుకూల దృక్పథంతో చూడడం ద్వారా మంచి సంబంధాల్ని కొనసాగించాలి. మన సహోద్యోగులతో, పై అధికారులతో ఎలా ఉంటామో మన కింద పనిచేసే వారితో కూడా సత్సంబంధాలు ఉండాలి. అంతేగాని వారిని తక్కువ చేసి చూడడం, మాట్లాడడం మనకు తగదు. సత్సంబంధాలు సత్‌సంకల్పంతోనే సాధ్యమవుతాయి.

## ముగింపు

సత్సంబంధాలకు విలువనివ్వని విశ్వాసులు దేవుణ్ణి సరైన విధంగా అర్థం చేసుకోలేరు. దేవుని ప్రేమ, క్షమ, సమాధానం, సహనం మొలైనవన్నీ ఎల్లప్పుడూ ఒక ప్రవాహంలా ప్రవహిస్తూనే ఉంటాయి. అవి తరిగిపోవడం, ఖాళీ అవ్వడం ఉండదు. దినదినం ఆయనతో సన్నిహిత సహవాసం కలిగి ఉంటే మన జీవితాల్లో కూడా ఇవి సమృద్ధిగా ఉంటాయి. ఇవి అంతరిస్తే వాటి ప్రభావం మన సంబంధాలమీద, పరిచర్య మీద ఖచ్చితంగా ఉంటుంది. దేవునితో "నిజమైన సహవాసం అనుభవించినప్పుడు, వ్యక్తుల మధ్య కంచెలు తప్పక తొలిగి పోవాలి, ముసుగులు తీసివేయాలి. తలుపు వెలుపల స్వాగత సంకేతాలను వేలాడదీయాలి" అని అంటాడు చక్ స్విండాల్. అలాంటి కృప దేవుడు మనందరికీ అనుగ్రహించును గాక!

**– ఆర్. శ్రీనివాసరావు & సుమ**

స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఎవరి జీవితమూ వడ్డించిన విస్తరి కాదు. వారి వారి అభిరుచులకు తగినట్టుగా అన్నిటిని తయారు చేసుకొని వాటిని ఆస్వాధించటమే గొప్ప విషయం. చేప పిల్లలకి ఈత ఎవరు నేర్పిస్తారు. పుట్టిన బిడ్డకు ఏడుపు ఎలా వస్తుంది. వారికి ఉన్న అవకాశాలను అందింపుచ్చుకోవడాన్ని బట్టే. అవకాశాలను వెదకి, వాటిని వినియోగించుకోవాలి. వాటిని అందిపుచ్చుకొని పైకి ఎదగడానికి ప్రయత్నించాలి. కెరీర్ (చదువు, ఉద్యోగం) ఉన్నత దశకు వెళ్ళడానికి అనేక అవకాశాలు మనకు ఎలా వస్తుంటాయి? అవకాశాలను అందిపుచ్చుకోలేకపోవడానికి కారణాలు ఏంటి? వాటిని అందిపుచ్చుకోకపోతే జీవితంలో కలిగే నష్టాలు ఏంటి? అందిపుచ్చుకోవడానికి ఏమి చేయాలి?

### నా జీవితంలో...

నేను ప్రకాశం జిల్లా, యండూరి పాలెం అనే ఒక మారుమూల పల్లెటూరు నుండి వచ్చాను. త్రిపురాంతకంలో జరిగే బైబిల్ స్టడీలో దేవునిని స్వంత రక్షకునిగా అంగీకరించాను. నమ్మిన తర్వాత డిప్లొమా ఇన్ ఫార్మసీ కర్నాటకలో నేను జాయిన్ అయ్యాను. ఒక్కసారిగా ఫిజికల్, స్పిరిచ్యువల్ పరిస్థితులు మారిపోయాయి. అంతా సిటీ వాతావరణం ఒక్క ముక్క ఇంగ్లీష్ రాదు. సబ్జెక్ట్స్ అన్నీ ఇంగ్లీష్‌లోనే. పరీక్షలు కూడా ఇంగ్లీష్‌లోనే రాయాలి. ఒక్క సబ్జెక్ట్ పాస్ కావడమే కష్టం. అంతా గందరగోళంగా ఉంది. టెన్షన్, భయం, బెంగ తిరిగి ఇంటికి వెళ్ళిపోవాలని అనిపించింది.

అయితే నా కెరీర్‌లో చదువులో నిలదొక్కుకోనేందుకు ఈ క్రింది అంశాలు నాకు సహాయపడ్డాయి.

1. **రక్షణ:** రక్షణ నా జీవితాన్ని మార్చివేసింది.
2. **విశ్వాసం:** దేవునిపై నాకున్న విశ్వాసం వల్ల దేవుడు నా జీవితాన్ని మార్చి, నా చదువులో కూడా మార్పు తీసుకొచ్చాడు.
3. **సాక్ష్య జీవితం:** కళాశాలలో బాగా చదివి గొప్ప సాక్ష్యం సంపాదించి అందరికీ సువార్త చెప్పాలనే కోరిక.
4. **పట్టుదల:** నాకు వచ్చిన ప్రతి అవకాశాన్ని అందింపుచ్చుకోవాలనే పట్టుదల నన్ను ఎంతో ప్రేరేపించేది.
5. **కష్టపడేతత్వం:** ఒకప్పుడు సోమరిగా ఉండే నేను ఇప్పుడు కష్టపడడానికి ఇష్టపడ్డాను. రోజుకి 16 గంటలు చదువుకి కేటాయించడం జరిగింది.
6. **జ్ఞాన సంపాదన:** నేను డిప్లొమా పూర్తి కావాలనే చదవలేదు, దానితోపాటు నాలెడ్జ్‌ని కూడా సంపాదించుకొనేటట్లు చదివాను, నా నాలెడ్జ్‌ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకొనేవాడిని. దీనికోసం పెద్దల సలహాలు, ఆ ఫీల్డ్‌లో ఉన్నవారి సహాయం తీసుకొనేవాడిని.

**7. ప్లానింగ్:** నేను చదువుకొనేటప్పుడు ఏమి చేయాలి? ఎలా చదవాలి? అనే అవగాహన, ప్లానింగ్ ఎప్పుడూ ఉండేది.

**9. అవగాహన:** మెడికల్ షాప్స్, కంపెనీలు, కాలేజీలు ఈ ఎంపికలు వచ్చినప్పుడు విద్యార్థుల మధ్య భారంతో టీచింగ్ ఫీల్డ్ ఎంపిక చేసుకొన్నాను. దానికి కావాల్సిన జ్ఞానాన్ని చదువుకొనేటప్పుడే పట్టు సంపాదించాను. ప్రతిరోజు న్యూస్‌పేపర్ చదవడం, కెరీర్‌కి సంబంధించిన ప్రోగ్రామ్స్‌కి హాజరవ్వడం ద్వారా అవకాశాలపై అవగాహన పెరిగింది.

**10. కమ్యూనికేషన్స్:** ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్ విషయంలో భయం లేకుండా, సిగ్గు పడకుండా మాట్లాడడం నేర్చుకొన్నాను.

ఆ విధంగా నేను డిప్లొమా మంచి మార్కులతో పూర్తి చేశాను. అది పూర్తి చేయడానికి నేను ఎంతో శ్రమించాను, బాధను అనుభవించాను. డిప్లొమా అయిన వెంటనే నన్ను మా ఊరిలో, మెడికల్ షాప్‌లో ఉంచారు. అందుకోసమే నన్ను డిప్లొమా చదివించారు. ప్రతిరోజు ఆ మెడికల్ షాప్‌లో ఉంటూ గ్రామంలోనే నా జీవితం కొనసాగించడం మరలా నన్ను ఆలోచింపచేసింది. నేను నా చదువు కొనసాగించాలని ప్రతిరోజూ న్యూస్ పేపర్, నోటిఫికేషన్స్ చదివి బి.ఫార్మసీకి అప్లై చేశాను. ఎంట్రన్స్ పాస్ అయి విజయవాడ సిద్ధార్థ కాలేజీలో జాయిన్ అయ్యాను. డిప్లొమాతో ఆగిపోయి ఉంటే నాకు ఏమి తెలిసేది కాదు. ఇక్కడ ఇటు ఫిజికల్‌గా, స్పిరిచ్యువల్‌గా నేను ఎంతో నేర్చుకున్నాను. అక్కడ సహవాసం, మార్గదర్శకత్వం, షేరింగ్, కేరింగ్, ఓపెన్ హోమ్, ప్రార్థన సహాయం, బైబిల్ స్టడీస్ నన్ను ఎంతో బలపరిచాయి.

నాలుగు సం॥ల తర్వాత బి.ఫార్మసీ పూర్తి చేసుకొన్నాను. మాకున్న ఆర్థిక పరిస్థితులను బట్టి నేను వినన్నపేట, వికాస్ కాలేజీలో రూ. 6,000 జీతానికి లెక్చరర్‌గా జాయిన్ అయ్యాను. అప్పటిలో జీతం చేతికి ఇచ్చేవారు అందరూ నాకంటే ఎక్కువ తీసుకోవడం, దేవుని బిడ్డగా నేను తక్కువ తీసుకోవడం నాకు సిగ్గు అనిపించింది. ఈ పరిస్థితి నన్ను మరలా యం.ఫార్మసీ వైపు అడుగులు వేసేలా చేసింది.

మరలా నేను ఎం.ఫార్మసీ ఎంట్రన్స్ రాయడం, ఇంట్లో వాళ్ళు ఫ్రీ సీట్ వస్తేనే చదివిస్తాం అని అనడంతో, దేవునిపై విశ్వాసంతో రిజర్వేషన్ లేకుండా ఓపెన్‌లో రాయడం సిద్ధార్థ కాలేజి బాపట్లలో యం. ఫార్మసీ సీటు వచ్చింది. యం.ఫార్మసీ పూర్తయిన వెంటనే మార్కాపురం కాలేజీలో లెక్చరర్‌గా మంచి జీతంతో సొంత ఊరిలో జాయిన్ అయ్యాను. కాలేజీలో కొన్ని చేయకూడనివి రాంగ్ అటెండెన్స్, ఎగ్జామ్స్ కాపీ, ల్యాబ్స్ మొ॥ పనులు నన్ను మరలా ఆలోచింపచేశాయి.


పరిస్థితులతో రాజీపడకుండా వెంటనే జాబ్ రిజైన్ చేసి మరలా వినన్నపేట, వికాస్ కాలేజీలో దేవుని చిత్తానుసారంగా జాయిన్ అయ్యాను. నేను చేయని పనులను వివరించి చెప్పి జాబ్ పొందడానికి దేవుడు సహాయం చేశారు. సబ్జెక్ట్‌పై పట్టు, నమ్మకత్వం, యధార్థత, దేవునిపై ఆధారపడడం, దేవుని చిత్తం చేయడం వంటివి నేను ఎక్కడికి వెళ్ళినా జాబ్ రావడానికి దోహదపడ్డాయి.

అక్కడితో నా ప్రయాణం ఆగలేదు. టీచింగ్ ఫీల్డ్‌లో అత్యున్నతమైన పిహెచ్.డి చేయాలని నా గోల్, నేను జాబ్ చేస్తూ పార్ట్ టైం పిహెచ్.డి ఎంట్రన్స్ రాసి జెఎన్‌టియు కాకినాడలో సీటు సంపాదించాను.

రాత్రి పగలు కష్టపడుతూ అన్నింటిని బ్యాలెన్స్ చేసుకొంటూ (కుటుంబం, జాబ్, పరిచర్య, చదువు) పిహెచ్.డి పట్టా సంపాదించాను. ఏ అంశంలోనూ పాపం చేయకుండా, దేవునికి వ్యతిరేకమైన పనులు చేయకుండా పూర్తి చేయడానికి ఎంతో వెల చెల్లించాల్సి వచ్చింది. నా ప్రొఫెషన్‌లో కొన్ని జర్నల్స్, ఆర్టికల్స్, బుక్స్ పబ్లిష్ చేసుకొన్నాను. అసిస్టెంట్, అసోసియేట్ నుండి అస్సాం కజిరంగా యూనివర్శిటీలో మంచి శాలరీతో ప్రొఫెసర్‌గా సెలక్ట్ అయ్యాను. ఎక్కడో ఉండాల్సిన నాకు దేవుడు తోడై ఉండి నడపించారు. నాకు అందిన ప్రతి అవకాశాన్ని నేను అందిపుచ్చుకోవడం ద్వారా దేవుడు నన్ను ఈ స్థితిలో ఉంచాడు.

### చాలామంది అవకాశాల్ని ఎందుకు అందిపుచ్చుకోలేరంటే?

భయం, నిర్లక్ష్యం, కష్టపడకపోవడం, సబ్జెక్ట్‌పై నాలెడ్జ్ లేకపోవడం, సోమరితనం, చదువు పట్ల, కెరీర్ పట్ల సరైన అవగాహన లేకపోవడం, పట్టుదల లేకపోవడం, ఇంగ్లీష్‌లో కమ్యూనికేషన్



స్కిల్స్ సరిగా లేకపోవడం, నాలెడ్జ్ అప్‌డేట్ చేసుకోకపోవడం, నమ్మకంగా లేకపోవడం, దేవునిపై ఆధారపడకపోవడం, సొంత ఊరు, ప్రాంతం వదిలి వెళ్ళడానికి ఇష్టపడక సుఖవలయంలో ఉండడానికి ఇష్టపడడం, ఇతరులను సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం మొ॥.

### అవకాశాల్ని అందిపుచ్చుకోవాలంటే ఏమి చేయాలి?

పులి బిడ్డ పులిలా బతకాలి. దేవుని బిడ్డ దేవుని బిడ్డలా బతకాలి. స్టూడెంట్స్‌కి స్టడీస్ దేవుడు ఇచ్చిన బాధ్యత దాన్ని ఖచ్చితంగా నెరవేర్చాలి. నీకున్న ఐ.క్యూని బట్టి నీవు ఎన్ని గంటలు కష్టపడాలో నిర్ణయించుకోవాలి. సబ్జెక్ట్స్ మీద పట్టు సాధించాలి. కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు, టెక్నికల్, లైఫ్ స్కిల్స్ కూడా నేర్చుకోవాలి. ఫెలోషిప్‌లో ఉన్న సీనియర్ అన్న, అక్క వాళ్ళ సలహాలు, సూచనలు తీసుకొని వారి మాదిరిని అనుసరించాలి. నీకున్న ఆటంకాలను చూస్తూ కూర్చోకుండా వాటిని ఎలా అధిగమించాలో ఆలోచించాలి. చదువు అయిపోయాక జాబ్ వెదకడం కాదు, చదువుతూ ఉన్నప్పుడే కెరీర్‌పై అవగాహనతో ఏ ఉద్యోగం చేయాలో నిర్ణయించుకోవాలి. స్టూడెంట్‌గా కష్టపడితే గ్రాడ్యుయేట్‌గా సుఖపడతావు. స్టూడెంట్‌గా సుఖపడితే గ్రాడ్యుయేట్‌గా కష్టపడతావు. ఎక్కువ శాతం విద్యార్థులు గ్రామీణ నేపథ్యం నుండి వచ్చినవారే. నిజమే అవన్నీ నాలో కూడా ఉన్నాయి. కానీ వాటిని నేను దేవుని సహాయంతో అధిగమించాను. నాకు సాధ్యం అయ్యింది అంటే ప్రతి ఒక్కరికీ సాధ్యం అనే చెప్పాలి.

### అవకాశాలను అందింపుచ్చు కోలేకపోవడం వల్ల కలిగే నష్టాలు

డిగ్రీలు సంపాదించవచ్చు గానీ, మంచి ఉద్యోగాలు రావు. జాబ్స్ దొరికినా నామమాత్రపు శాలరీతో పనిచేయాలి, డిమాండ్ చేయలేము. పెళ్ళికి ఇదొక పెద్ద పరీక్ష. పెళ్ళి అయిన తర్వాత జీవితం, నిరాశ, నిస్పృహలు కలిగి ఉంటాము. జాబ్ ఎప్పుడు తీస్తారో, కొత్తది దొరుకుతుందో లేదో అనే టెన్షన్‌లో ఉండాలి. మనలో సత్తా లేకపోతే ప్రతి ఒక్కరికీ భయపడాలి. దేవునికి కాకుండా బాస్‌కి భయపడాలి. పరిస్థితులతో రాజీపడి జీవించాలి. సమాజంలో, బంధువుల్లో చిన్నచూపుకు గురి అవుతారు. అవకాశాలను వదిలివేస్తే మనకు కావాల్సినప్పుడు రావు. ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంటుంది.

### ముగింపు

అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ గారి బయోగ్రఫీని పరిశీలిస్తే 20 సంవత్సరాల అలుపెరుగని పోరాటం చేసి ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొని ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొని, అవకాశాలను వెదుక్కొని చెప్పులు కుట్టిన స్థితి నుండి ఆ దేశాన్నే శాసించే స్థితికి ఎదిగాడు. దేవుడు నిన్ను నన్ను మరీ అంత స్థితిలో ఉంచలేదు. "కృషితో నాస్తి దుర్భిక్షం". ఆయన బతికినంత కాలం ఆయనే అమెరికా అధ్యక్షుడుగా ఉండాలని ప్రజలు తీర్మానించుకొనే విధంగా సాగింది ఆయన పరిపాలన.

అలానే దానియేలు పరాయి దేశం, భాష కాని భాష, బానిసగా ఉంటూ ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని పరిశుద్ధంగా, పవిత్రంగా జీవిస్తూ ఆ దేశానికే ప్రధానమంత్రి అయ్యాడు. అలానే పౌలు దేవునితో వ్యక్తిగత దర్శనం దగ్గర నుండి జీవితాన్ని పూర్తి కాల సేవకు, సువార్త సేవకు అర్పించి తన కాలం, ధనం, తెలివితేటలు, నైపుణ్యాలు ఉపయోగించి ప్రాణం పోయే వరకు ప్రతి అవకాశం ఉపయోగించుకొని సువార్త పనిచేసిన ఫుల్ టైం వర్కర్.

ప్రియ చెల్లీ, తమ్ముడూ ఆలోచించు. వీరి మాదిరి అనుసరించి ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకో, అద్భుతంగా కెరీర్‌లో, జాబ్‌లో రాణించు. అందరి మన్ననలు పొందుకో, దేవుని నామానికి మహిమ తెచ్చేవారిగా ఉండాలని కోరుకొంటూ, ప్రార్థిస్తున్నాను.

– **అనిల్, పద్మిని,** వినుకొండ




# క్షమించడం

## మన జీవనశైలి కావాలి

1999వ సం॥ జనవరి 22 తేదీ అర్ధరాత్రి మన దేశంలో ఒక దారుణమైన సంఘటన జరిగింది. దేవుని పిలుపుకు లోబడి ఎన్నో సౌకర్యాలు విడిచిపెట్టి ఆస్ట్రేలియా నుండి భారతదేశానికి వచ్చి 30సం॥లకు పైగా ఒరిస్సాలో కుష్ఠురోగుల మధ్య సేవ చేస్తూ ఉన్న బాప్టిస్టు మిషనరీ గ్రేహం స్టెయిన్స్, ఆయన ఇద్దరు పిల్లలు తిమోతి, ఫిలిప్‌లతో కలిసి బయట వ్యాన్‌లో నిద్రపోతుంటే ధారాసింగ్, అతని అనుచరులు పెట్రోలు పోసి సజీవ దహనం చేశారు. ఈ సంఘటనలో భర్తను, ఇద్దరు పిల్లలను కోల్పోయిన గ్లాడిస్ స్టెయిన్స్ "హంతకులను నేను క్షమించాను. వారి పట్ల నాకు ఎలాంటి ద్వేషం లేదు. ఇండియాలోని ప్రజల పట్ల నాకు ప్రగాఢ గౌరవం ఉంది..., దేవుడు నన్ను క్షమించాడు, ఆయనను అనుసరించే వారుకూడా అలానే క్షమించాలని ఆశిస్తున్నాడు" అని స్పష్టంగా చెప్పింది. పుట్టెడు దు:ఖంలో ఉండి కూడా గ్లాడిస్ చెప్పిన ఈ మాటలు హంతకులకు, సంఘ వ్యతిరేక శక్తులకు చెంపపెట్టులా, క్రైస్తవులకు సవాలుగా మారాయి, ప్రపంచాన్ని నివ్వెరపరచాయి.

### క్షమాపణ అంటే?

క్షమాపణ అంటే షరతులు లేకుండా కీడు లేదా తప్పు చేసిన వ్యక్తి పట్ల దయ చూపించడం. ఎదుటివారు చేసిన గాయాన్ని, నష్టాన్ని లెక్కించకుండా ఇష్టపూర్వకంగా మనసులో నుండి చెరిపి వేయడం. ఇది పాపాన్ని సహించడం కాదు. ఎదుటి వ్యక్తి మేలును ఆశించడం.

### క్షమించడం దేవుని లక్షణం

క్షమాపణ చూపడం దేవుని లక్షణం. ఆయన కృప వాత్సల్యతలను బట్టి మానవాళికి ప్రసాదించిన వరం క్షమాపణ. కీర్తనలు 86:5లో "ప్రభువా నీవు దయాళుడవు క్షమించుటకు సిద్ధమైన మనస్సు గల వాడవు". క్షమించడానికి ఆయన ఎప్పుడూ సిద్ధమే. పాపులుగా జన్మించిన మనము శాశ్వతంగా నాశనం కావడం దేవునికి ఇష్టంలేక సర్వమానవాళికి ఆయన సిలువ వద్ద క్షమాభిక్షను సిద్ధం చేశాడు. ఆ క్షమాపణ పొందాలంటే మనసారా, హృదయమంతటితో పాపాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఒప్పుకోవాలి (యోహాను 1:9). తప్పిదాలను కప్పిపుచ్చుకొనే వారు వర్ధిల్లరు. దేవదేవుని క్షమాపణ పొంది ఆయనను ప్రభువుగా స్వీకరించిన వారు ధన్యులు. విశ్వాసి జీవితం క్షమాపణతో మొదలై, క్షమాపణతోనే కొనసాగుతుంది.

## విశ్వాసులు క్షమాగుణం కలిగి ఉండాలి

ఇతరులను సులువుగా క్షమించే తత్వం విశ్వాసుల్లో పెంపొందాలి. ఎవరి హృదయంలో పరిశుద్ధాత్మ దేవుడు పనిచేస్తున్నాడో, ఎవరు దేవునికి విధేయత చూపుతున్నారో వారికి క్షమించే విషయంలో దేవుడు సహాయం చేస్తాడు. అందరితో సత్సంబంధాలు కలిగి ఉండడం తప్పనిసరి. ఇతరులతో సంబంధాలను సరిచేసుకోకుండా సతమతమయ్యే వారి ఆరాధనను, కానుకలను దేవుడు అంగీకరించడు. "కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ అర్పణము విడిచిపెట్టి మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము. అటు తరువాత వచ్చి నీ అర్పణము అర్పింపుము'' (మత్తయి 5:23,24). ప్రభువు నేర్పిన ప్రార్థనలో కూడా ఇతరుల తప్పిదాలను మనం క్షమించలేదంటే మన పరమ తండ్రి మన తప్పిదాలను క్షమించడని ఉంది (మత్తయి 6:14,15). దీనర్థం ఇతరులను క్షమించడం ద్వారా దేవుని క్షమాపణను సంపాదించుకోగలమని కాదు. దేవుని క్షమాపణ ఆయన ఉచిత కృప వలన వస్తుంది. కాబట్టి దేవుని రాజ్య వారసులు ఇతరులను క్షమించలేనట్లయితే అది ఆయన దృష్టిలో పెద్ద నేరంగా పరిగణించబడుతుంది.

సిలువ వేయబడిన తరువాత యేసుప్రభువు నోట నుండి వెలువడిన మొదటి మాట క్షమాపణ గురించే. సిలువ వేసిన సైనికులను, ఆ అమాయకులైన యూదులను తండ్రి క్షమించాలని యేసు ప్రార్థించాడు. పాపక్షమాపణకు వ్యక్తిగత పశ్చాత్తాపం తప్పనిసరి. పశ్చాత్తాపపడిన దొంగకు అక్కడికక్కడే క్షమాపణ లభించింది (లూకా 23:43).

## ఎలా క్షమించాలి? ఎంతవరకు క్షమించాలి?

"....ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించినలాగున మీరును క్షమించుడి" (కొలస్సీ 3:13)."...క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫెసీ 4:32). ప్రభువు మనల్ని క్షమించినట్లే మనం కూడా క్షమించాలి.

## ప్రభువు మనల్ని ఎలా క్షమించాడు?

ఒక అవిశ్వాసి దేవుని వద్ద పశ్చాత్తాపంతో ప్రార్థిస్తే క్షమాపణ దొరుకుతుంది. కానీ ఒక విశ్వాసి తన పాపాన్ని హృదయపూర్వకంగా ఒప్పుకొంటే సరిపోదు. కొన్ని షరతులున్నాయి. మనల్ని మనం తగ్గించుకొని హాని చేసిన వ్యక్తి వద్దకు వెళ్ళి క్షమాపణ కోరి సంబంధాన్ని సరి చేసుకోవాలి. దేవుడు మానవ సంబంధాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చాడు. క్షమించబడని పాపం మనసులో ఉంచుకొన్నప్పుడు ఆత్మ దేవుడు దుఃఖపడతాడు. దేవునితో సహవాసం కోల్పోతాము. "నేను నేనే నా చిత్తానుసారముగా నీ అతిక్రమమును తుడిచివేయుచున్నాను. నేను నీ పాపములను జ్ఞాపకము చేసుకొనను, నాకు జ్ఞాపకము చేయుము. మనము కూడి వాదింతము (యెషయా 43:25,26). " నేను వారి దోషమును వారి పాపమును క్షమించునట్లు తమ దుర్మార్గతను విడిచి పశ్చాత్తాపడుదురేమో" (యిర్మియా 36:34). కాబట్టి దేవుని సన్నిధిలో పాపమును ఒప్పుకోవాలి. ఇతరులతో కూడా ఒప్పుకొని సరిచేసుకోవాలి.

## ఒప్పుకొనని పాపంతో కొనసాగితే పర్యవసానాలు

విశ్వాసులు ఒప్పుకొనని, కడగబడని లేదా క్షమాపణ పొందని స్థితిలో కొనసాగితే వివాహ బంధంలోనూ తర్వాత సహవాసంలోనూ సమస్యలు సృష్టిస్తారు. కోపం, చికాకు విసుగు, అవిధేయత, విమర్శ వంటి శరీర కార్యాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. దేవునితో సహవాసం లోపించిన వ్యక్తుల వల్ల కుటుంబాల్లో, పరిచర్యలో, సహవాసాల్లో తీవ్ర పరిణామాలు చోటు చేసుకొంటాయి. మాటల్లో, భావోద్రేకాల్లో, ప్రవర్తనలో దేవుని ప్రేమ కనిపించదు. ఫలితంగా కోపతాపాలు, ద్వేషాలు, విభేదాలు, కలహాలు, ఈర్ష్య, మత్సరము, స్వార్థము, పక్షపాతము, అపవాదులు బయటికి వస్తాయి. సాధ్యమైనంత త్వరగా ఒప్పుకొని, క్షమించుకొని సమాధానపడితే సమస్యలు సద్దుమణుగుతాయి. లేదంటే కుటుంబంలోని సమస్యలు సహవాసాన్ని, పరిచర్యను నిర్వీర్యం చేస్తాయి.

## ఇతరులను క్షమించడం కష్టమైతే?

తమ తప్పును గుర్తించి సారీ చెప్పిన వాళ్లను క్షమించడం సులువే. కానీ సమర్థించుకొనే వాళ్ళని క్షమించడం కష్టమే. ఫలితంగా బాధకు లోనయ్యేది మనమే. ఇతరులతో సంబంధాలు సరిగా లేనప్పుడు అంతర్లీనంగా బాధ కలుగుతుంది. నెగిటివ్ భావోద్రేకాలు చివరికి అల్సర్లు, అధిక బిపి,



హార్ట్ అటాక్‌లు రావడానికి కారణం అవుతాయి. క్షమించలేకపోవడానికి మనలోని స్వనీతి, గర్వం కావచ్చు. దేవుడు మనల్ని సాక్షులుగా ఉండమన్నాడు, తీర్పరులుగా కాదు. మన కంటిలోని దూలమును తీసివేసుకొని ఇతరుల పట్ల యథార్థమైన ప్రేమ కలిగి ఉండడానికి దేవుని సహాయం తీసుకోవాలి. మన క్షమాపణ వారిలో మార్పుకు కారణం అవుతుంది.

### సంబంధాలు సరి లేనప్పుడు పరిచర్య ఫలిస్తుందా?

క్షమించలేని పాపం ఉంటే పరిచర్య ఫలించదు. క్షమాపణ ఉన్నచోట ఐక్యత ఉంటుంది. సహవాసంలో కలిగే ఈ ఐక్యత దేవునికి ఎంతో ఇష్టం. అక్కడ ఆశీర్వాదం, శాశ్వత జీవం ఉంటాయి. పాపపు ఒప్పుకోలు అనే కన్నీటితో వేసే సువార్త విత్తనాలు బహుగా ఫలిస్తాయి. అప్పుడు సంతోష గానంతో పంటను కోస్తాము. సహవాసంలో గౌరవించుకోవడం, ఘనపరచుకోవడం, ప్రేమతో ఆదరించుకోవడం, ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం ప్రతిఫలిస్తాయి.

### తప్పులను ఒప్పుకోవడం అంటే?

ఒక వ్యక్తి తాను తప్పు చేసినట్లు గుర్తించి, సమ్మతించి, పరిష్కరించే దిశలో మనసులో తీర్మానించి, పశ్చాత్తాపంతో దేవుని సన్నిధిలో ఒప్పుకోవాలి. ఆయన సహాయంతో వ్యక్తులతో కూడా ఒప్పుకోవాలి. ఈ విషయంలో పారదర్శకత ఎంతో అవసరం. ఎందుకంటే పాపం యొక్క బలం విశ్వాసి జీవితాన్ని నాశనం చేస్తుంది. పరిశుద్ధాత్మ దేవుడు మనల్ని హెచ్చరించినప్పుడు ఆయన అధికారానికి లోబడాలి. లేదంటే పాపము దేవునితోనున్న సహవాసాన్ని అడ్డుకొంటుంది. ఇది ఒక భయంకర పర్యవసానం.

### కాలం పరిస్థితులను సరి చేస్తుందా?

సంబంధాలను సరిచేసుకొనే విషయంలో కాలమే పరిష్కరిస్తుందనుకోవడం ఒక అపోహ మాత్రమే. సంవత్సరాల తరబడి దాచి పెడితే నష్టపోయేది మనమే. ఎంత త్వరగా సరి చేసుకొంటే అంత మంచిది.

### క్షమించిన తరువాత జ్ఞాపకాలు మిగిలి ఉంటాయా?

మానవరీత్యా పూర్తిగా క్షమిస్తే దానికి జ్ఞాపకాలు ఉండవు అనేది ఒక భ్రమ మాత్రమే. గుర్తుంటాయి, కానీ అవి మనల్ని బాధించవు. దేవుడు వారి పాపములను జ్ఞాపకము చేసుకోను అంటాడు. ఇది దేవునికి సాధ్యము. అయితే ఆ జ్ఞాపకాల నుండి బయటకు తీసుకొని రావాలని దేవునిని అడగాలి, ఎంతో ప్రార్థించాలి. దేవుని సారూప్యతలోనికి ఎదుగుతూ ఉన్నప్పుడు ఆయన ఆ గుర్తులనుండి విడిపిస్తాడు. అంతేగాని ఒక వ్యక్తిని సహవాసంలోకి అనుమతించిన తరువాత వారి వ్యక్తిగత తప్పిదాల ను గుర్తు చేయకూడదు.

### తప్పులను క్షమిస్తే పర్యవసానాలు రద్దవు తాయా?

సిలువ పైన ఉన్న దొంగ క్షమాపణ పొంది పరలోక రాజ్య వారసుడయ్యాడు. కానీ మరణశిక్ష తప్పించుకోలేదు. కొన్ని అసాధారణ, ప్రత్యేక పరి స్థితుల్లో పర్యవసానాలు ఉండవు కానీ, సాధారణంగా ఫలితాలు అనుభవిస్తాము.

### పదే పదే తప్పిదాలను కొనసాగించే వారిని ఎన్ని సార్లు క్షమించాలి?

మనం ఎన్నిసార్లు క్షమించినా దేవుడు మనల్ని క్షమించిన పర్యాయాలతో పోల్చుకొంటే అది లెక్క లోనికి రాదు. అయితే వారిని ప్రేమపూర్వకంగా హెచ్చరించాలి. దేవుని నామం దూషణ పాలవుతుంది అంటే వారి పట్ల కఠిన నిర్ణయాలు తీసుకోవాలి.

### ముగింపు

క్షమాపణ మానసిక ఆత్మీయ శారీరక స్వస్థతకు దారితీస్తుంది. మన కుటుంబాల్లో సహవాసాల్లో యదార్థమైన ప్రేమ వెల్లివిరియాలంటే ఒకరినొకరు అర్థం చేసుకొని, అంగీకరించి, క్షమాగుణాన్ని అల వర్చుకోవాలి. మనస్పర్థలతో అపోహలతో చేసే పరిచర్య దేవునికి అంగీకారం కాదు. కాబట్టి దేవుని బిడ్డలంగా క్షమాపణ మన జీవనశైలి కావాలి. ప్రేమ నిరీక్షణతో మన ప్రభువు నామమును ఘనపరచడంలో ముందుకు కొనసాగుదాం.

– డా. మెర్సీ సుజాత, ఓయు జోన్,
హైదరాబాద్

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2024-2026**

**Date of Printing: 25-01-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ప్రభూ,
## నిన్ను సేవింప నేర్పవా!

ప్రభూ...
దరిచేరే దారికోసం
తడవులాడే మా కళ్ళలో
వెలుగునింపే జ్యోతివయ్యావు
గువ్వలా మూల్గుతున్న మా మదిలో
వేదన తీర్చే వేల్పువయ్యావు
మాకు మార్గంగా దిగివచ్చావు
నీ ప్రేమ, క్షమ నేర్చుకోమన్నావు
నీవు నేర్పిన పరిశుద్ధ సూత్రాలను
అనుసరించలేకపోతున్నాం
ఓర్చుకున్న నిన్ను లోకానికి
చూపలేకపోతున్నాం!

తడబడే అడుగుల చిన్నారి
వడివడి పరుగులు చూసి
కన్నవారు సంతోషించినట్టు
కొత్తగా జన్మించిన మేము
ఉత్తమంగా ఎదిగితే
ఆనందించాలని నీవు ఆశిస్తుంటే
బెల్లం కొట్టిన రాయిలా
అక్కడే వేసిన గొంగడిలా
అజ్ఞాన దశలోని ఆశలను
విడవలేకపోతున్నాం
ముక్కిపోయిన మూల పాఠాలను
వదలలేక పోతున్నాం!

వృద్ధి కలిగించే నిన్ను
బుద్ధిగా సేవించడానికి
మాకు సాయం చేయవా
కార్యసిద్ధి కలిగించే
నీ మీదే ఆధారపడేలా
మా తలపులు క్రమపరచవా
నడుం కట్టి సేవచేసిన
నీ అడుగుల్లో నడిచేలా
మా కాళ్ళను బలపరచవా!
అప్పుడే
నీ కాడి ఎత్తుకొని
నీ యొద్ద నేర్చుకొంటాం
నీ సిలువను హత్తుకొంటాం
నీ సేవచేస్తాం!

– **గొంగటి మేరిజాయ్,** ఆదోని